PHOOL KI PATHI (Telugu)

పూలరెమ్మ

ఆధారం

మాయల్ ఖైరాబాది

తెలుగురూపం

ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

పూలరెమ్మ

ఆమె కళ్లు తెరిచినవి తెరిచినట్లే ఉన్నాయి. జీవితంలో ఎప్పుడూ ఇలాంటి కాంతిని చూడలేదు. ఇంటి పరిసరాలన్నీ పాలలో స్నానించినట్లుగా దేదీప్యమాన కాంతితో తళుకులీనుతున్నాయి.

పక్కలో పాప. బోసినవ్వుల పాప. హాయిగా, అమాయకంగా నిద్ర పోతోంది.

పాలనురగలాంటి, మంచుముద్దలాంటి తెల్లని చల్లని కాంతి పాప ముఖం నిండా పరచుకుంటోంది.

ఎంత చక్కని కాంతి!

పండు వెన్నెలగూడా ఇంత మనోహరంగా ఉండదు కదా!

ఏమీ! కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతి!

ఆమె లేచి కూర్చుంది. పక్కలో పాపాయి.

బోసి నవ్వుల పాపాయి. చిట్టి చేతుల్ని పట్టి చూసింది. నుదుటిపై వెచ్చని ముద్దు పెట్టింది.

కాంతి... అదే కాంతి.. ఏ మార్పూ లేదు.

ఆమెకేమీ అర్థం కావడం లేదు. ఏమిటిదంతా! అసలేం జరగబోతోంది.

భయం, ఆందోళన, ఆశ్చర్యం, సంతోషం, సన్నగా ఆమె పెదవులు కదిలాయి.

దేవా! ఏమిటిదంతా?

నేనొక బలహీనురాలిని. నువ్వు అత్యంత శక్తి సంపన్నుడవు. నేను నీ శరణు వేడుకొంటున్నాను.

ఆమె తదేకంగా గుమ్మం వైపు చూస్తోంది.

ఆకారాలు! ఏమిటీ ఆకారాలు!! అవి నేరుగా ఆమె గదిలోకే వస్తున్నాయి.

చూస్తుండగానే అవి ఆమెను సమీపించాయి.

ఆమె గుండె లయ తప్పుతోంది. అణువణువూ భయంతో కంపించిపోతోంది.

"ఎ.. ఎ.. ఎవరు మీరు? ఎందుకొచ్చారు? నేను పచ్చి బాలింతరాలిని. ఇదిగో నా పాప. ఈమె వయస్సు ఒక్కరోజే దయచేసి నన్నేమీ అనకండి. దైవానికి భయపడండి.."

ఆమె ఆలోచనల్లో పడిపోయింది. ఇప్పుడేం చేయాలి. భర్త కూడా ఈ రోజే తనను వదిలేసి వెళ్లిపోయాడు. వీళ్లేదైనా అఘాయిత్యానికి పాల్పడితే తను ఎలా ఎదుర్కోవాలి?

"చూడమ్మా! నీకేమీ భయం లేదు. మేము దైవం పంపితే వచ్చిన

వాళ్లం. మేము నీపై శాంతిని కురిపించాలనేది దైవాదేశం. అవునూ! నీ పేరు సకీనా కదూ! నీ పేరులోనే ఉంది శాంతి."

ఆమె మనసు కుదుట పడింది.

తేలిగ్గా శ్వాస పీల్చింది. భయం మటుమాయమైంది.

ఎంతటి శాంతి వచనాలు! ఎంతటి తియ్యటి పలుకులు!!

దైవం పట్ల కృతజ్ఞతతో ఆమె కళ్లు మూతలు పడ్డాయి.

అంటే.. అంటే.. వీరు దైవదూతలన్నమాట!

దైవదూతల రాకతో ఆ ఇల్లు, ఇంటి పరిసరాలు జ్యోతిర్మయ మయ్యాయి. ఇల్లంతా సుగంధ పరిమళాలతో గుబాళిస్తోంది. ఇలాంటి సువాసనను మానవ మాత్రుడెవడూ ఆస్వాదించి ఉండడు. ఆమె అలానే కళ్లప్పగించి వారినే చూస్తోంది. జరగబోయే పరిణామాలకు మానసికంగా సిద్ధమవుతోంది. ధవళవస్త్రాల్లో మెరిసిపోతున్న దైవదూతలు మానవాకారంలో ఉన్నారు. వారిలో ఓ దైవదూత పాప వైపు చేయి చాచాడు.

సకీనాలో ఉత్కంఠత! ఆతృత!!- సంతోషం!! ఆమె అలానే చూస్తోంది. దైవదూతల పట్ల ఆమెకేమాత్రం అనుమానం లేదు. కాని.. కాని... మాతృహృదయం.

"అయ్యా! దైవదూతలారా! ఇది నా ఒక్కగానొక్క తొలి సంతానం. నిన్ననే ఈ లోకంలోకొచ్చింది. ఈమె తండ్రి- అంటే, నా భర్త ఆడపిల్ల పుట్టిందని తెలియగానే కనీసం చూడనైనా చూడకుండా నన్ను వదిలేసి వెళ్లిపోయాడు" తన ధోరణిలో తాను చెబుతోంది సకీనా.

దైవదూత ఆమె మాటల్ని పట్టించుకోకుండా పాపను తన చేతుల్లోకి తీసుకుని, 'మీ రెక్కలను విస్తరించండి' అన్నాడు సహచరులతో.

సకీనా చూస్తుండగానే తూర్పు పడమర, ఉత్తర దక్షిణాల సరిహద్దుల వరకు దైవదూతల రెక్కలతో సకీనా గది విస్తరించింది. ఆమె కళ్లు తెరిచినవి తెరిచినట్లే ఉన్నాయి. దైవదూతల రెక్కల ద్వారా దైవకారుణ్య ఛాయ భూమ్యాకాశాలను ఆవరించింది. అంటే సకీనా గది భూమ్యాకాశాలంత విశాలంగా విస్తరించింది.

"దేవా! ఈ విశ్వవ్యవస్థలో నీ మహిమలు ఎన్నెన్ని..?" పాపను రెక్కల్లో దాచుకొని దైవదూతలంటున్న మాటలు సకీనాకు స్పష్టంగా వినబడు తున్నాయి.

"గృహవాసులారా! మీపై శాంతి వర్షించుగాక! ఇదో బలహీన ప్రాణి" అంటూ దూతలు ఆప్యాయంగా పాప తల నిమిరారు.

"ఎవరైతే ఈ పాపను భారంగా భావించక ప్రేమగా సాకుతూ సంరక్షిస్తారో, ప్రళయం వరకు దైవసహాయం వారి వెన్నంటి ఉంటుంది."

"ప్రళయం రోజు కూడానా?" సకీనా మధ్యలోనే ప్రశ్నించింది.

"సకీనా! నీకు శుభం. నీ భర్త మనసులో అజ్ఞానం గూడుకట్టుకుంది. ఏదో ఒకనాడు ఆ అజ్ఞానం తొలగిపోతుంది."

"అయితే ఆయన తిరిగి వచ్చేస్తారా?"

ఆతృతగా ప్రశ్నించింది సకీనా.

దైవదూతలు ఏమీ సమాధానం చెప్పకుండా తమ రెక్కలను

ముడుచుకున్నారు. "దైవదూతలారా! దయచేసి చెప్పండి. ఆయన వచ్చేస్తారా?"

"అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వబరకాతుహూ.." (నీ పై శాంతి, కరుణ, శుభం అవతరించుగాక) ఒక్కసారిగా వెలుగు మాయమైంది.

పండు వెన్నెల్లాంటి వెలుగు. మంచు ముత్యాల్లాంటి కాంతి పుంజం.

లేదు వీల్లేదు, వెలుగు వెళ్ళిపోవడానికి వీల్లేదు.

ఆమె ఒక్కుదుటున మంచం దిగి గుమ్మంవైపు పరుగెత్తింది.

వెళ్ళిపోతున్న వెలుగును పట్టి ఆపుదామని.

కాని... కాని...

'అస్సలాతుఖైరుమ్మినన్నౌమ్' సమీపంలోని జామె మసీదు నుండి శ్రావ్యంగా అజాన్ పిలుపు కర్ణపుటాలకు తాకింది.

సరిగ్గా అప్పుడు సకీనా కళ్లు తెరుచుకున్నాయి.

పక్కలో పాప - బోసినవ్వుల పాప.

ముదులొలికే పాప- మురిపాల పాప.

హాయిగా నిద్రపోతోంది. తను మంచంపైనే పడుకొని ఉంది.

లౌడ్ స్పీకర్‌లో మసీదు నుండి అజాన్ వినబడుతూనే ఉంది.

అంటే... అంటే...?

ఇదంతా కలా? అవును కలే. అందమైన కల.

సకీనా ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. ఆమె పాప చిట్టిచేతుల్ని ముద్దాడింది.

గుండెలకు హత్తుకుంది. ఇప్పుడామె మనసు ప్రశాంతంగా ఉంది.

ఒకరోజు ముందున్న ఆందోళన ఇప్పుడామెలో లేదు.

మళ్లీ ఏవో జ్ఞాపకాలు. భర్త జ్ఞాపకం.

అయ్యయ్యో భర్త వెళ్లకుండా ఉంటే ఎంత బాగుండును. ఆలోచనా ఝురిలో మాగన్నుగా నిద్ర- భర్త జ్ఞాపకాలు.

★ ★ ★

"సకీనా! ఇంకెంతసేపు పడుకుంటావు. పాప ఏడుస్తోంది చూడు" అంటూ మేల్కొలిపింది పక్కింటి సమీనా.

సమీనా పిలుపుకు దిగ్గున లేచిన సకీనా కళ్లు నులుముకుంటూ, "ఏమిటి? ఆయనొచ్చేశారా?" అంటూ ఆతృతగా ప్రశ్నించింది.

"ఎవరూ...?"

"ఎవరా?..." సకీనా ముభావంగా లేచి కూర్చుంది. ఆమె ముఖంలో విచారం స్పష్టంగా కనిపిస్తోంది. కల తాలూకు జ్ఞాపకాల్ని దిగమింగుకుంటూ, 'సరేలే... ఇంతకూ నువ్వెప్పుడొచ్చావు?"

"ఇప్పుడే వచ్చాగాని, నీ ఆరోగ్యం ఎలా ఉంది? ఏమైనా పీడకలలు గాని వచ్చాయా? ఏదో కలవరిస్తున్నట్లున్నావు? కష్టాల్లో ఉన్నప్పుడొచ్చే కలలు మరింత కలవరపాటుకు గురిచేస్తాయి."

సకీనా తన కల గురించి చెప్పాలనుకుంది. కాని కలలోని శుభం పోతుందన్న పెద్దల మాట జ్ఞాపకమొచ్చి ఊరుకుంది.

"సరేగాని కొద్దిగా మంచి నీళ్లివ్వు పుక్కిలిస్తాను."

"అగాగు, కాస్త వేడి చేసి ఇస్తాను. పుక్కిలిద్దువుగాని."

"ఇదిగో సకీనా! నువ్వు బాలింతవు. ఏది పడితే అది తినకూడదు" అంటూ తను తెచ్చిన ఇడ్లీలు పెట్టింది. సకీనా వేడి నీళ్లతో ముఖం కడుక్కొని ఉల్లిపాయ కారం కొద్దిగా అద్దుకొని రెండు ఇడ్లీలు తిన్నది. తరువాత సమీనా ఇచ్చిన టీ తాగింది.

"ఊ ఏమిటి విశేషాలు చెప్పు ఈ రోజు నీ మొఖంలో కాస్త కళ కనిపిస్తోంది. మీ అయనగానీ వస్తున్నాడా!" అంటూ సకీనా దగ్గరగా స్టూలు వేసుకొని కూర్చుంది సమీనా.

"ఆయనెలాంటి వాడో నీకు తెలుసుగా! అమ్మాయి పుట్టిందని వెళ్లిపోయాడు. ఎప్పుడొస్తాడో ఏమో!" కాస్త దిగులుగా అంది సకీనా. "ఏమిటోనమ్మా ఈ మనుషులు, వీళ్ల మనస్తత్వాలు, ఆడ పిల్లయినా మగ పిల్లోడైనా మన చేతుల్లో ఏముంది? చదువుకున్నోడని పేరేగాని, ఆ చదువుకి అర్థమేముంది? అంతా అజ్ఞానం, మూర్ఖత్వం."

'పోనీలే ఆయన్నేమీ అనకు. ఆయన అనేవన్నీ చెబితే నువ్వు ఇంకేమంటావో?"

"ఇంకేమంటాను నా బొంద. ఆడపిల్లయితే అన్నీ ఖర్చులే - ఆమెను పెంచి పోషించి లక్షలకు లక్షలు కట్నం ఇచ్చి పెళ్లి చెయ్యాలి. అదే మగ

పిల్లోడైతే లక్షలకు లక్షలు కట్నమూ తెస్తాడు. వంశాన్నీ ఉద్ధరిస్తాడు. అంతేగా ఆయననేది?"

"అంతేనా! ఈ రోజుల్లో మంచి సంబంధాలు కూడా దొరకడం లేదట. కాగడా బెట్టి వెతుక్కుంటూ, చెప్పులరిగేలా తిరిగినా మంచి కుర్రాళ్లు దొరకడం లేదట."

"అది తర్వాత సంగతి. ముందు మన బుద్ధి మంచిదైతేగా!... ఒక్క మీ ఆయనే కాదు. సమాజంలో ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. మానవ సంబంధాలన్నీ డబ్బుతో ముడిపడి ఉన్నాయి. సరే, మన మాటలకేమొచ్చేగాని, నేను ఓసారి ఇంటికెళ్లొస్తా జాగ్రత్త."

"మంచిది - మరి పాపకు ఉగ్గు ఎప్పుడు పట్టను?"

"నోట్లో ఏమైనా తేనె చుక్క వేశావా?"

"అసలు నోరు తెరిస్తేగా!"

"అమ్మో! నీ బిడ్డ మహా అసాధ్యురాలు" అంటూ సమీనా పాప బుగ్గలను, చేతులను నిమిరింది.

అంతలో - "ఏమ్మో! ఏమంటోంది నీ బిడ్డ" అంటూ వచ్చింది మంత్రసాని.

"సకీనా! సమయానికి మంత్రసాని కూడా వచ్చింది. నేనిక ఇంటికెళ్లి వస్తాను" అంటూ సమీనా వెళ్లిపోయింది.

"అమ్మా ! బాగున్నావా? ఏంతిన్నావీ రోజు"

"ఏమీ లేదమ్మా! మా పక్కింటి సమీనా రెండు ఇడ్లీలు, ఓ కప్పు

చాయ్ ఇచ్చింది అంతే. మూడు రోజులు ఎల్లిపాయకారంతో పత్యం చేయాలట. తనకు తెలియకుండా నోట్లో ఏమీ వేసుకోవడానికి వీల్లేదని హుకుం జారీ చేసింది."

"అవునమ్మో! ఆమె చెప్పింది కరెక్టే. బాలింత పత్యం చాలా ఖచ్చితంగా చెయ్యాలి లేకపోతే చాలా సమస్యలొస్తాయి" అంటూ పొత్తి కడుపు తడిమి చూసి అన్నది మంత్రసాని. "అసలు కాన్పయినట్లే లేదు... అసలు.." "ఛీ.. నోర్ముయ్" సిగ్గుపడి పోయింది సకీనా. "నీ పొత్తి కడుపు, నరాలన్నీ చాలా బాగున్నాయి. ఏ మాత్రం సాగలేదు. నీ స్నేహితురాలు ఏం పెట్టిందేమిటి?"

"చెప్పాగా, ఇడ్లీ, టీ మాత్రమేనని."

తరువాత మంత్రసాని పాపను ఒళ్లోకి తీసుకొని ముద్దుపెట్టుకుంది.

"నీ బిడ్డకు దిష్టి తగులుద్దమ్మో!" అంటూ పాపను కాళ్లపై పడుకోబెట్టుకొని నూనె పట్టించసాగింది. పాప కాళ్లూ చేతులూ ఆడిస్తూ ఏడుస్తుంటే, 'అమ్మా- ఏడుస్తున్నావా? ఏడ్చినకరాలు చేస్తే ఊరుకుంటాననుకున్నావా? అమ్మా హాష్.. హూష్" అంటూ కబుర్లు చెబుతూ పాప ఒంటికి నూనె పట్టించసాగింది.

"అమ్మమ్మా! గిన్నెలో టీ ఉంది. చేతులు కడుక్కొని టీ వేడి చేసుకొని తాగు. అలాగే ఆ డబ్బాలో బిస్కట్లు కూడా ఉన్నాయి తిను."

"నాకెందుకమ్మా బిస్కట్లు."

"బిస్కట్లు తప్ప ఇంకేమీ లేవమ్మా మా ఇంట్లో. అవి తింటూ టీ చప్పరించు."

"సరే నే వస్తానమ్మా! తయ్యిబా వాళ్లింటికి కూడా వెళ్లాలి. ఆమె కోడలు నిండు గర్భిణీ. అమ్మాయి నజీరా తెలుసా నీకు. పాపం... ఏం చెప్పమంటావు. బరువులు ఎత్తొద్దమ్మా అంటే వింటేగా.... చాలా రక్తం పోయిందమ్మా. డాక్టరమ్మ డి.అండ్.సి. చేయాలంది. చూడు, ఎంత కష్టమొచ్చిందో" అంటూ ఊరి కథలన్నీ చెబుతుంటే సకీనా తల ఊపుతూ ఆలకించింది. ఆమె అటు వెళ్లగానే పక్కింటి సమీనా ప్రత్యక్షమైంది. మంత్రసాని చెప్పిన మాటలన్నీ ఏకరువు పెట్టింది సకీనా.

సమీనా కూడా పొత్తి కడుపు తడిమి చూసి ముసిముసిగా నవ్వుతూ, "మంత్రసాని చెప్పింది నిజమే. దేవుడు చల్లగా చూశాడు. రేపట్నుండి మంచి తిండి పెడతాలే."

"మరీరోజు?"

"ఈ రోజుకి ఎల్లిపాయ కారమే."

"సమీనా! అన్నిటికీ నువ్వు ఆదుకుంటున్నావు కాబట్టి సరిపోతోందిగాని, లేకపోతే నాకిక్కడ ఎవరున్నారు చెప్పు. కట్టుకున్నవాడు కన్న బిడ్డను కూడా చూడకుండా వెళ్లిపోయాడు" సకీనా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"సకీనా నువ్వు బాధపడకు, నేను మా ఆయనతో చెప్పాను. మీ ఆయన ఖమ్మంలో ఉన్నా, విజయవాడ, హైదరాబాదుల్లో ఉన్నా ఎక్కడున్నా చెవి పట్టి లాక్కొస్తారు. నువ్వేమీ విచారించకు. దైవాన్ని ప్రార్థించు" అంటూ ధైర్యం చెప్పింది సమీనా.

"ఏమిటో, నాకంతా అయోమయంగా ఉంది."

"ఈ మగాళ్లకసలు బుద్ధిలేదు."

"మగాళ్లందరూ అంతేనా?"

"అందరూ కాదనుకో. కాని చాలా మందికి కొడుకులపై ఉన్న ప్రేమ కూతుళ్లపై ఉండదు. కొడుకులైతేగాని పెళ్లయ్యాక ముసలి తల్లిదండ్రుల్ని బజారుకీడుస్తారు. ఆ సత్తార్‌గారి పరిస్థితి చూడు. ఎంత కష్టపడి కొడుకును చదివించాడో. తినీ తినక, పస్తులుండి ఆ వెధవను చదివించారు. కొడుకు పెద్దోడై వృద్ధాప్యంలో సాయపడతాడనుకున్నారు.

అనుకున్నట్టే కొడుకు పెద్దోడయ్యాడు. పెద్దపెద్ద చదువులు చదివాడు. పెద్ద డాక్టరయ్యాడు.

సత్తార్ గారు కొడుక్కి పెళ్లి చేశారు. కోడలు పిల్ల ఇంట్లో అడుగు పెట్టింది. సత్తార్ గారు కోడల్ని కన్నకూతురుకంటే ఎక్కువగా చూసుకునే వారు. ఆ అమ్మాయికి సీరియల్ కథల పిచ్చి. టీవీకి అతుక్కుపోయేది. ఒక రోజు సినిమాకు వెళుతుంటే, "అమ్మా! ఎక్కువగా సినిమాలు చూడడం వల్ల ఆరోగ్యం చెడిపోతుంది. కళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. అయినా ఈనాటి సినిమాల్లో హింస, అశ్లీలం తప్ప ఏముంటున్నాయి" అంటూ సున్నితంగా మందలించారట.

సకీనా ఇక చూస్కో- ఆ అమ్మాయి కన్నతండ్రి కంటే ఎక్కువగా చూసుకునే మామగారి మీద మండిపడిందట. కొడుకు చోద్యం చూస్తూ, మా విషయాల్లో నువ్వెందుకు జోక్యం చేసుకుంటున్నావనీ, ఓ ముద్ద తిని పడి ఉండరాదని చీవాట్లు పెట్టాడట.

ఆనాటి నుండి ఈనాటి వరకు ఇంటిముందున్న ఓ ఇరుకు గదే

సత్తార్‌గారి స్వర్గసీమ. రోజూ రెండు పూటలా సమయానికి ప్లేటులో భోజనం ఇచ్చి పోతుంటాడు కొడుకు. రెండు పూటలు తిండిపెట్టడమే పెద్ద గొప్ప.

కోడలు కనీసం మామగారి వైపు చూడనుకూడా చూడదట. తండ్రిని చూడమని కొడుకూ చెప్పడట. ఇదీ కొడుకుల పరిస్థితి. అయినా కొడుకులే కావాలని కనబడే, కనబడని దేవుళ్లనందరినీ మొక్కుకుంటారు ప్రజలు.

ఆహా! నిజానికి అమ్మాయిలే ఇళ్లకు వెలుగు. సేవాభావం, సహన గుణం వారి నైజంలోనే ఉంది. తల్లిదండ్రులకు ఆడపిల్లలు చేసే సేవ ఎవరు చేస్తారు చెప్పు.

సరే, మన కబుర్లకేమొచ్చెగాని, అసలు విషయం చెబుతా విను. మీ ఆయనది కాస్త పురుషాధిక్య ధోరణి అట. దానికితోడు ధార్మిక పరిజ్ఞానమూ అంతంత మాత్రమే. సగటు మగవాడు ఆలోచించినట్లే ఆలోచిస్తాడుగాని, ధార్మిక స్పృహ ఉన్న వాడిలా ఆలోచించడు. ఆడపిల్ల పుడితే కట్నాలు కానుకలు ఇవ్వాలని, విలాసవంతమైన జీవితానికి అమ్మాయిల పుట్టుక ప్రతిబంధకమని అందరూ అనుకున్నట్లే మీ ఆయన కూడా అనుకుంటాడు. కాని తాను ఆచరిస్తున్న ధర్మం ఈ వివక్షలకు లేశమైనా తావివ్వదన్న జ్ఞానం ఆయనకు లేకపోయింది. కాని ఏదో ఒక రోజు పశ్చాత్తాపపడుతూ వస్తాడు చూడు."

"ఇవన్నీ నీకెరు చెప్పారు?"

"ఇంకెవరు- మా ఆయన చెప్పారు."

"సరేగాని, ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు. ఏ పనీ చేయకుండా నేను ఇంకా ఇలా ఎన్ని రోజులుండాలి?"

"అప్పుడే ఏం తొందర? ఒళ్లు కాస్త రక్తం పట్టనీ."

"అదే ఇంకెన్ని రోజులు అంటున్నారు"

"ఓ పది పదిహేను రోజులనుకో. నలభై రోజులదాకా ఎలాగూ నమాజు చేయడం కుదరదు."

"పది రోజుల తర్వాత అన్ని పనులు చేసుకోవచ్చు గదా!"

"అప్పుడే ఎందుకంత ఆతృత. దైవం మీకు తిండి పెట్టడా ఏం? నారుపోసిన వాడు నీరు పోయడా?"

"అదికాదు, మన ప్రయత్నంగా ఏదో ఒకటి చెయ్యాలి కదా!"

"ఇంట్లో ఏమైనా ఉన్నాయా? లేక అయ్యగారు పోతూ పోతూ అవి కూడా తీసుకు వెళ్లారా?"

"ఏమున్నాయిలే తీసుకెళ్లడానికి? ఏవో ఒకటి రెండు నగలున్నాయి. అవి అమ్ముకొని తిన్నా ఓ రెండేళ్లు గడిచిపోతాయి. కాని సమస్య అది కాదు. నేను ఏదో ఒకటి చెయ్యాలనుకుంటున్నాను."

"అంటే- నీకు ఆయనొస్తాడనే నమ్మకం లేదా?"

"బహుశా ఆయన రాకపోవచ్చు. అయినా పోషించేవాడు దేవుడు. ఆయన అనుగ్రహం చాలా గొప్పది."

"నువ్వెందుకలా ఆలోచిస్తున్నావు?"

"నేనేమీ తప్పు మాట్లాడలేదుగా."

"నీ మాటలు ప్రవక్త ప్రవచనాలు కావు తెలుసా!"

"దైవం క్షమించుగాక! ఆ మాటలు నేనెలా అంటాను. కాని ..." తన కలను గురించి సమీనాకు చెప్పేయాలనుకొంది. కాని వెంటనే నిగ్రహించుకుంది.

"ఊఁ ఆగిపోయావేం... చెప్పు."

సకీనా మరేదో చెప్పి మాట దాటవేసింది.

★ ★ ★

"రా కూర్చో సమీనా, అలాగే నిలబడ్డావే.. ఏమిటలా చూస్తున్నావు?"

"నేను నీ ముఖాన్ని చూస్తున్నాను."

"నా ముఖాన్నా? నా ముఖాన్ని ఈ రోజే కొత్తగా చూస్తున్నావా? ఇంతకు ముందెప్పుడూ చూడలేదా?"

"రోజూ చూస్తూనే ఉన్నాను. కాని ఈ రోజు ఏదో ప్రత్యేకత కనబడుతోంది నీ ముఖంలో. దిష్టి తగులుద్దేమో చూడు."

"ఏమిటో ఆ ప్రత్యేకత. ఈ రోజు నా ముఖంలో ఏమైనా వజ్ర వైఢూర్యాలు కనిపిస్తున్నాయా?"

"కాదు. అంతకంటే గొప్పది ఏదో...!"

"ఇక చాల్లేగాని కూర్చో. ఈ రోజు నాకంటే పిచ్చి మాలోకం నీకు మరెవరూ దొరకలేదా బనాయించడానికి."

"నువ్వొక్కసారి అద్దంలో చూస్కో. నేను బనాయిస్తున్నానో, నిజం చెబుతున్నానో నీకే తెలుస్తుంది."

"ఎప్పుడో చూసుకున్నాను. నువ్వంటున్నట్లు నా మొహంలో ఎలాంటి ప్రత్యేకతా లేదు."

"నీ కళ్లతో కాదు. నా కళ్లతో చూడు."

"సరేలేగాని కూర్చో. నీతో చాలా విషయాలు మాట్లాడాలి. ఈ రోజు నాక్కొన్ని సలహాలు కూడా ఇవ్వాలి."

"రోజూ ఇచ్చే సలహాలే, ఈ రోజు కొత్తేముంది గాని, ఒక మాట చెప్పు."

"ఏమిటది?"

"నువ్వు నలభై రోజుల స్నానం నీళ్లతోనే చేశావా? లేక పాల సముద్రంలో జలకాలాడి వచ్చావా?

"అంటే... కాస్త అర్థమయ్యేలా చెప్పు... తల్లీ...!"

"అర్థం కాలేదా? ఎరుపెక్కిన నీ బుగ్గలనడుగు, నల్లని నీ కురులను అడుగు. కైపెక్కిన నీ కళ్లను అడుగు. విరబూసిన నీ వదనము నడుగు..."

"అమ్మమ్మో! ఇక ఆపు నీ కవిత్వం. ఇదెప్పటి నుండి మొదలెట్టావు? ఇదిగో నేను సీరియస్‌గా చెబుతున్నా- అదలా వదిలేసి నాకో మాట చెప్పు..."

"మాటా లేదు, గీటా లేదు. ఏమన్నా ఉంటే తరువాత అడుగు, కాని ముందు నాకో విషయం చెప్పు. మీ ఆయన జాడ ఏమన్నా తెలిసిందా?"

భర్త ప్రస్తావనతో ఎర్రమందారంలా వికసించిన సకీనా మోము ఒక్కసారిగా ముడుచుకుపోయింది.

"ఏమీ తెలియలేదు" అంది సకీనా ముభావంగా.

"ఓ దేవా! ఈ నిండు జీవితం ఏ అండతో గడవాలి?"

"వెనుకా ముందు నాకెవరున్నారని? కేవలం దైవసహాయమే నాకు చాలు."

"మరి ఈ లంకంత కొంపలో ఒక్కదానిని ఎలా ఉంటావు?"

"ఇప్పుడు ఉంటూనే ఉన్నానుగా."

"ఇంత పెద్ద ఇంట్లో భయం వేయడం లేదా?"

"భయమేస్తూనే ఉంటుంది. కాని ఎక్కడికని పారిపోను. కనీసం ఒక సోదరుడన్నా ఉంటే అక్కడికి వెళ్లిపోయేదాన్ని."

"సకీనా! ఊరంతా గుసగుసలు మొదలయ్యాయి తెలుసా?"

"మా ఆయన విషయంలోనా?"

"కాదు కాదు. స్వయంగా నీ గురించే."

"నా గురించి గుసగుసలా..?"

"సకీనా వయసులో ఉన్న పిల్ల. పైగా ఒంటరిగా ఉంటోంది. దురదృష్టవశాత్తూ..."

సమీనా మాట పూర్తి కాకముందే సకీనా భయంతో కంపించి పోయింది.

"సమీనా! అంతా నా ఖర్మ. నేనేం చేయను చెప్పు."

"నువ్వేం చేస్తావు? అయినా ఏం చేయగలవు..?" అంటూ సమీనా ఆలోచనలో పడిపోయింది. కొద్దిసేపు ఇద్దరూ ఏదో ఆలోచిస్తూ ఉండి పొయ్యారు. సకీనా కళ్లు నిండుకుండలుగా తయారయ్యాయి.

కొద్దిసేపటి మౌనం తర్వాత;

"అన్నయ్యగారు విజయవాడ వెళ్లారన్నావుగా, ఏమైనా కబురు తెచ్చారా" అడిగింది సకీనా.

"జాడ తెలిస్తే ముందే చెప్పేయనా? మీ ఆయన అక్కడెక్కడా ఉన్న జాడే లేదట."

"యా అల్లాహ్...!" నిట్టూర్చింది సకీనా. సకీనా నిట్టూర్పులోని ఆవేదన, బాధను గ్రహించిన సమీనా చలించిపోయింది. సకీనాను గుండెలకు హత్తుకుంది.

"సకీనా! నా బొందిలో ప్రాణమున్నంత వరకూ ఎవడూ నీ వైపు కన్నెత్తి చూడలేడు. వాడి కళ్లు పీకేస్తాను. వాడి నెత్తురు తాగుతాను. ఈ ఇంటి వైపు అడుగు వేయడానికి ఎవడికైనా ఎంత ధైర్యం? అందుకే మా ఆయన అంటూ ఉంటారు."

"ఏమని?"

"పురుషుల్లేని ఇంట్లో పరువు కాస్తా ప్రమాదంలో పడుతుందని."

"నాన్చకుండా విషయమేమిటో సూటిగా చెప్పు."

"ఇందులో నాన్చేదేముందిగాని, నువ్వు బారసాల నీళ్లు పోసుకున్న తరువాత నీ రూపం అద్భుతంగా తయారైంది. ప్రతిచోట ఈ విషయమే చర్చనీయాంశమైపోయింది. నాకేమో భయం పట్టుకుంది."

"రూపమో పాడోలేగాని, ఒంటరిగా ఉండడం నాకూ చాలా భయంగానే ఉంది. ముఖ్యంగా రాత్రివేళల్లో చాలా భయం వేస్తోంది."

"మీ ఆయన గుర్తొస్తున్నాడేమే."

"ఆయనెప్పుడూ గుర్తొస్తూనే ఉంటాడు. కాని నా ఉద్దేశం ఆ భయం కాదు. నువ్వంటున్నావు చూడు ఆ భయం- సరేగాని, ఒక విషయం అడుగుతా చెప్పు."

"ఏమిటి?"

"నువ్వు వాస్తవం చెప్పు. నన్ను ఒంటరిగా చూస్తూ ఎవరైనా..."

"అవునమ్మా! అక్కడక్కడా కొందరు చెప్పుకుంటున్నారట."

"ఓ దేవా! పరువు ప్రతిష్టలను ప్రసాదించేవాడవు నువ్వే..."

"అందరినీ రక్షించేది ఆ దేవుడే. కాని మన ప్రయత్నం మనమూ చెయ్యాలి. రాత్రి వేళల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి."

"సమీనా! ఏం చెప్పమంటావు? రాత్రి వేళల్లో కంటి మీద కునుకుపడితే ఒట్టు. ఏం చేయను. ఎక్కడికని పోను?"

"ఎక్కడికెళతావు? నేను లేనా ఏమిటి?"

"నీ మాటలు వింటుంటే ఏ వెధవో నా మీద కన్నేసినట్లు అనుమాన మొస్తోంది. చెప్పు ఆ దొంగ వెధవెవడో?"

"ఇంట్లో ఉండే దాన్ని నాకెలా తెలుస్తుంది కాని మా ఆయన సకీనాను జాగ్రత్తగా ఉండమని చెప్పమన్నారు. నన్ను కూడా నిన్ను ఒంటరిగా వదలొద్దని చాలా గట్టిగా చెప్పారు."

"దైవం అన్నయ్యను (మీ ఆయనను) కరుణించుగాక! సొంత చెల్లెలి కన్నా ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు నా పట్ల. నువ్వైతే నా స్వంత అక్కతో సమానం. దైవం తర్వాత ఇక నాకు నువ్వు, మీ ఆయనే అక్కయ్య, అన్నయ్య."

"పొరుగున ఉండి ఈ మాత్రం కూడా సాయం చేయలేకపోతే దైవానికి, దైవప్రవక్తకు ఏ ముఖం చూపిస్తారు - ఎవరైనా."

సమీనా కుటుంబం చూపుతున్న అభిమానం సకీనాపై మంచి ప్రభావాన్ని వేసింది. ఏదో ప్రమాదం నుండి తనను హెచ్చరించడానికి వచ్చిందని అర్థం చేసుకుంది సకీనా. అంతలో మున్నీ కేర్‌మని ఏడ్చేసరికి పాపను ఒళ్లోకి తీసుకొని స్తన్యం ఆమె నోటికందించింది.

పాప పాలు తాగుతున్నప్పుడు సకీనా మనసుకు ప్రశాంతత చేకూరింది. సరిగ్గా రెండు నెలలకు పూర్వం పాప పుట్టినప్పటి దృశ్యాలు, ఆనాటి ఆ కల, ఆమె మనోఫలకంపై లీలగా మెదిలాయి.

ఆ కలనామె ఒక శుభసూచికగా భావించింది. కల గుర్తొచ్చినప్పుడల్లా ఆమెకోలాంటి మధురమైన అనుభూతి, నిర్భీతి, సంతృప్తి కలిగేది. పాపకు పాలిస్తున్న సకీనా కలలో లీనమై పరిసరాలనే మరచిపోయింది. పక్కన పొరుగింటి సమీనా కూర్చొని ఉందన్న విషయాన్నీ మరచిపోయింది. ఆమె పెదవులపై కల తాలూకు దరహాసాలు నాట్యమాడుతున్నాయి.

"పెదవులు చిరుహాసాలు చిందిస్తున్నాయి. ఏమిటి విశేషం? ఏం గుర్తొచ్చింది?" ప్రశ్నించింది సమీనా.

"ఏమున్నాయి సమీనా! పాతరోజులు జ్ఞాపకమొస్తున్నాయి. అప్పుడప్పుడూ అవే నవ్విస్తుంటాయి. ఏడిపిస్తుంటాయి."

"నిజమే మరి- ఏం చేస్తాం" అంటూ మరికాసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత 'మరి నే వస్తా' అంటూ లేచి నిలబడింది. సకీనా ఈసారి కూడా కలను గురించి ప్రస్తావిద్దామనుకొని ఊరుకుంది.

"మరి ఆ విషయం ఏమీ చెప్పలేదే..?"

"ఏ విషయం..?"

"నువ్వు చూస్తేనే ఉన్నావుగా, పొద్దస్తమానం ఊరికే గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటున్నాను. కనీసం ఇల్లు గడపడానికైనా నేనేమైనా చేయాలనుకుంటున్నాను."

"అంటే మీ ఆయన ఇక రాడనే అనుకుంటున్నావా?"

"ఎప్పుడొస్తాడో ఏమో ఎవరికి తెలుసు. అదీగాక ఆయన చాలా మొండి మనిషి. పట్టుదల ఎక్కువ."

"నువ్వలా ఎందుకనుకొంటున్నావో ఏమోగాని, ఈ పంతాలు పట్టింపులు ఎన్నాళ్లుంటాయి? మూడు నాలుగు నెలలు గడిస్తే ఆయనే వస్తాడు. ఆయనకు మాత్రం ఇల్లు, కుటుంబం గుర్తురావా ఏమిటి?"

"సరేరానీ, వస్తాడనే అనుకుందాం, రాడని ఎందుకనుకోవాలి. అందాకనైనా ఏదో ఒకటి చేయాలి. అన్నయ్యగారు నా కోసం ఏమన్నా ఆలోచించారా? ఏదో ఒక పని ఎందుకాలోచించలేదు."

"ఆలోచిస్తున్నారనుకో. అయినా ఇందులో ఆలోచించేదేముంది? కుట్లు, అల్లికలు ఇలాంటివి అనేకం ఉన్నాయి. ఇవి మనం ఎప్పుడైనా చేసుకోవచ్చు. వీటివల్ల ఎంతో కొంత ఆదాయం వస్తుంది."

"మరయితే...?"

"ఆయన వీటికి భిన్నంగా మరేదైనా పని ఆలోచిస్తున్నారు."

"కొత్త పనులు ఇంకా నాకే మొస్తాయని?"

"దేవుడు ఏదో ఒక దారి చూపుతాడు."

"ఇన్షా అల్లాహ్ తప్పకుండా."

"సరే, మరి నేవెళతాను చాలా సేపయింది వచ్చి" అని సెలవుతీసుకొని వెళ్లిపోయింది సమీనా.

సకీనా పాపకు పాలిచ్చి ఊయ్యాలలో వేసింది. పాప పాలు తాగి కొత్త ఉత్సాహంతో ఉయ్యాలలో ముద్దుముద్దుగా కాళ్లూ చేతులూ ఆడిస్తోంది. "నువ్విలా బుద్ధిగా ఆడుకో, నీ కోసం ఓ ఫ్రాకు తయారు చేస్తాను అలాగే పూరెమ్మలా ఉన్న నీకు ఆడుకోవడానికి కూడా ఓ 'పూలరెమ్మ' తయారు చేస్తాను" అంటూ కత్తెర, కాగితాలు, గుడ్డముక్కలు ముందేసుకొని కూర్చుంది సకీనా.

★ ★ ★

"గురూ! విన్నావా ఆ విషయం?"

"ఏమిటది? ఏ విషయం?"

"మాంచి రంగొచ్చి నవనవలాడుతోంది ఆ చిలక."

"ఏ చిలక..?"

"నీది ట్యూబులైటు. తొందరగా వెలిగిచావదు."

"అబ్బా - ఊరించకు, తొందరగా చెప్పిచావు."

"అదే, ఆ బర్కతుల్లా కోడలు. నయీమ్ గాడి పెళ్లాం."

"ఆ... ఆ... ఇప్పుడు వెలిగింది. అద్భుత సౌందర్యరాశి. ఆ మీసాల రాయుడి భార్య."

"ఆ... ఆ మీసాల నయీమ్ మీసాలు కిందకు వాలిపొయ్యాయి."

"ఏం...? ఎందుకని?"

"పెళ్లాం నీళ్లోసుకొంది మొదలు కానుపయిందాకా మసీదులో కూర్చొని మగపిల్లాడి కోసం ప్రార్థనలు చేశాడు. తీరా ఆడపిల్ల పుట్టింది."

"అయితే..?"

"అయితే ఏంటెహె...! వాళ్ల కుటుంబం మోతుబరీ కుటుంబమట ఒకప్పుడు. ఆడ పిల్ల పుట్టడం నామోషీ అట. పైగా ఖర్చులు. కట్నాలు కానుకలిచ్చి పెళ్లి చేయాలి. అల్లుడు రావడం చిన్నతనం..."

"అయితే...?"

"మళ్లీ అదే సచ్చు డైలాగు... ఈ అవమానాన్ని భరించలేక పెళ్లాన్నొదిలేసి వెళ్లిపోయాడు మొగుడు."

"మరి పాపం ఈ పెళ్లాం గతి?"

"ఇరుగు పొరుగు ఉంటారు కదా. వాళ్లే చూశారు."

"ఆ బర్కతుల్లా ఖాందాన్‌లో ఇప్పుడెవడున్నాడని? సమయానికి ఆదుకునే వాడెవడుంటాడు?"

"గురూ! ఎవరు చూస్తారు. ఎవరాదుకుంటారని కాదు ఇప్పుడు సమస్య."

"మరేమిటి?"

"నేను ఏదో చెప్పాలనుకుంటే, నువ్వేదో చెబుతావేంటి?"

"మరదేంటో సూటిగా చెప్పకుండా ఈ డొంక తిరుగుడేంటెహె."

"బిడ్డ పుట్టిన తర్వాత ఆ సకీనా ఒక అప్సరసలా తయారైంది. ఆ అందాన్ని ఆస్వాదించడానికి రెండు కళ్లు చాలవు."

"మరయితే ఏం చేద్దామని? మొగుడెళ్లిపోయినంత మాత్రాన మరెవరూ ఉండరా ఏమిటి? కనీసం దేవుడైనా ఉంటాడుగా. ఏ దిక్కూలేని వాళ్లకు దేవుడే దిక్కు."

"మాంచి రసపట్టు మాటల్లో ఉన్నప్పుడు మధ్యలో దేవుణ్ణి తీసుకొస్తావేం.. నేనేదో వేరే విషయం చెప్పాలనుకుంటుంటే..."

"చెప్పమరి.."

"గురూ! ఆమె ఒంటరిగా ఉంటోంది. ఒంటరిగా ఉన్న వాళ్లకు తోడు కల్పించాలా వద్దా?"

"తోడు కల్పించాలా? -అంటే..?"

"ఇప్పుడూ వెలగలేదా? ఒంటరి ఆడదానికి నాలాంటి వాడు తోడు కల్పించాలంటున్నాడంటే... అర్థం కాలేదా?"

"వదిలేయ్ గురూ! సకీనా అలాంటిది కాదని విన్నాను. నీ పన్నాగాలు ఆమె దగ్గర పారవు."

"పిరికి వాడిలా మాట్లాడకు. ఈ నజీర్ ప్లాన్ వేశాడంటే దానికి తిరుగే ఉండదు. ఈ నజీర్ వల పన్ని, గింజలు చల్లిన తర్వాత పిట్ట చిక్కకపోవడమనేది అసంభవం."

"అవమానం పాలుకావడం తప్ప మరేమీ ఒరగదేమో!"

"నువ్వు నా మాట పూర్తిగా వినవే లేదు, అప్పుడే నిర్ణయాలు చేసేస్తున్నావా?"

"చూడు గురూ! ఆ అమ్మాయి మొదట్నుంచీ చాలా బుద్ధిగా బతికింది. శీలవతురాలు. ఇప్పుడు తల్లి కూడా అయింది. నువ్వు వంద ఉచ్చులు పన్నినా ఆమె నీ ఉచ్చులో చిక్కదు."

"కానీ, నీకు ఈ మిత్రుడు నజీర్ గురించి కూడా పూర్తిగా తెలుసుననుకుంటా!"

"కాస్త కాదు, బాగా తెలుసు. నావ్వామెవైపు నోట్లకట్టలు వెదజల్లగలవు. బెదిరించగలవు, బుజ్జగించనూగలవు. తిమ్మిని బమ్మిని చెయ్యగలవు. కాని నువ్వామెను జయించలేవు. ఎట్టి పరిస్థితిలోనూ ఆమె తన పరువు ప్రతిష్ఠలపై మచ్చరానీయదు."

"ఆహా! ఏం చెప్పావు గురూ! ఒంటరి ఆడది. నిస్సహాయ, అగత్య పరురాలు, ఇంట్లో ఏకాంతంగా ఉండే ఆ ఆడది... ఆహా.. ఆహా..! ఏం చెప్పావు."

"ఒంటరి ఎందుకు? ఇరుగు పొరుగు ఉండరా? చుట్టాలు పక్కాలు లేరా? ఆ వీధిలో ఈనాటి వరకు ఏ ఆకతాయీ కన్నెత్తి కూడా చూడలేక

పోయాడు. వాళ్లు నిరుపేదలైనా, నిస్సహాయులైనా వాళ్లల్లో కాస్తో కూస్తో దైవభీతి అనేది ఉంది."

"నాకు అలాంటి వాటితో పనిలేదు. నేను పథకం వేస్తాను. వల పన్నుతాను. అంతే. చిలక దానంతట అదే వచ్చి వాలుతుంది. నా చేతికి చిక్కుతుంది. అర్థమయిందా?"

"నాకయితే అర్థమే కాలా."

"అర్థమైతే...? సహకరిస్తావా?"

"నాకు పూర్తి పథకం సంపూర్ణంగా అర్థం కానంత వరకూ నేనేమీ వాగ్దానం చేయలేను."

"సరే అయితే జాగ్రత్తగా విను. ఇలా దగ్గరికి రా."

"చెప్పు. ఇక్కడ నువ్వూ నేనూ తప్ప మూడోవాడెవడూ లేడు."

"అవిగో అటుచూడు. ఆ చెట్లు, ఈ గోడలు, అదిగో ఆ మున్సిపాలిటీ వాళ్ల చెత్తకుండీ. ఈ ఎలక్ట్రిసిటీ వాళ్ల కరెంటు స్థంభం, ఇంకా ఏమోమో ఉన్నాయి. అవన్నీ వినవా?"

"ఓహో! అలా అంటున్నావా? అలా అనుకుంటే అసలైన వాడు ఆపైవాడు కూడా ఉన్నాడు."

"ఆపై వాడంతటివాడు కింద కూడా ఉండొచ్చుగా."

"పై వాడెప్పుడూ పైనే ఉంటాడు. అంతటి వాడెవడూ కిందలేడు."

"లేడా? చూడు, నేను చూపిస్తాను."

* * *

"ఎలా?"

"ఇదిగో ఇలా... ఈ ఐదొందలూ ఖర్చుల కోసముంచుకో. అవసరాన్ని బట్టి, సమయాన్ని బట్టి ఇంకా... ఇంకా... ఇప్పుడు దగ్గరికిరా, నేను చెప్పేది విను."

"వింటానుగాని, మరీ ఐదొందలే.."

"చెప్పు, ఎంత కావాలి?"

"కనీసం ఒక రెండు వేలన్నా...'

"ఒకే... ఇవిగో తీసుకో.."

ఒప్పందం కుదిరిన తర్వాత నజీర్ తన మిత్రుడు గుల్జార్ చెవిలో గుసగుసలాడాడు. నజీర్ నోట పథకం విన్న గుల్జార్ వదనం దీపావళి మతాబులా వెలిగిపోయింది.

"నీకు నువ్వే సాటి నజీర్!"

"అదీ- ఇప్పటికైనా ఒప్పుకున్నావా?"

"ఒప్పుకున్నా గురూ ఒప్పుకున్నాను."

"మరయితే ఓ..కే...!"

"ఓకే... ష్యూర్!"

"మరీ ఎక్కువ కానియ్యకు."

"సరే, నేను మా వాళ్లకు కూడా చెబుతా."

"మరింకేమైనా...?"

"ఇంకేమీ లేదు. ఫలితమే తరువాయి..."

★ ★ ★

సకీనా జొహర్ నమాజులో లీనమైవుంది. నమాజులో లీనమై ఉందేకాని మనసు మనసులో లేదు. ఆలోచనలు పరిపరివిధాలా పరుగులు పెడుతున్నాయి. పగలు ఏదో ఒకలాగ గడిచిపోతుంది. కాని రాత్రే ఒక సమస్య. రాత్రి యావత్ ప్రపంచాన్నీ తన ఒడిలో పడుకోబెట్టుకుని జోకొడుతోంది. రాత్రి ఒడిలో యావత్ ప్రజలు ఓ చిన్నపాటి మృత్యువుకు లోనై ఉన్నప్పుడు ఎవరైనా ఇంట్లో దూరితే..? సకీనా నమాజులో అత్తహియ్యాత్, దరూద్ చదువుతోందా... లేక అనుమానాలు, భయాల జపం చేస్తోందా..? ఆమెకే అర్థం కాలేదు. తప్పు తెలుసుకుని ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వెంటనే సహూసజ్దా చేసింది సకీనా. కుడి ఎడమలకు సలాము చెప్పి అలానే కూర్చుండిపోయింది.

నిజమే, పక్కింటి సమీనా అన్నట్లు, ఈ రోజు ఆయనే ఉన్నట్లయితే, ఈ ఇంటి సరిహద్దుల్లోకి రావడానికి ఎవరికైనా ఎన్ని గుండెలు?

అవును, ఎవరో అన్నట్లు 'భర్త లేని స్త్రీ రక్షణ లేని మణి'. ఈ నానుడి గుర్తుకు రాగానే ఆమె గుండెలు భయంతో దడదడ కొట్టుకోసాగాయి. వెంటనే లేచి ఇంటికి తాళం వేసింది. తరువాత గుర్తొచ్చి 'అయ్యయ్యో నా మతిమండ. పట్టపగలే ఇంటికి తాళమేశానేమిటి?' అనుకుంది.

తరువాత పొరుగింటి వైపు కిటికీ తెరుద్దామని రెండడుగులు వేసింది. అంతలో మున్నీ ఏడుపు లంకించుకుంది. వెంటనే పొరుగింటావిణ్ణి మరచిపోయి తన ఆశల పంట మున్నీని గుండెలకు హత్తుకొని పాలుపడుతూ మళ్లీ ఆలోచనల్లో మునిగిపోయింది.

"సమీనా ఎవడో బద్మాష్‌ను గురించి చెప్పింది. వాడి బుద్ధి అసలు మంచిది కాదని, అలాంటి బద్మాష్‌గాడు రాదలిస్తే ఈ చిన్నపాటి గోడ, ఈ

తాళం తననేం రక్షిస్తాయి. ఓ పరాత్పరా! అందరినీ కాపాడే రక్షకా! నేనొక నిస్సహాయురాలను. నన్ను కాపాడు" అనుకొంటూ ఒక్క క్షణం కళ్లు మూసుకుంది.

గుండెలోంచి తన్నుకొస్తున్న దుఃఖానికి ఆమె కళ్లు నిండుతటాకాలై పొర్లిపోతున్నాయి. మున్నీ పాలు తాగుతూ తాగుతూ మళ్లీ నిద్రలోకి జారుకుంది.

పాపను పడుకోబెట్టి ఆమెపై ఓ పలుచని బట్టను కప్పి, వరండాలో అటూ ఇటూ ఏమీ పాలుపోని దానిలా పచార్లు చేయసాగింది.

"ఏమిటి విశేషం, పెద్ద పెద్ద అంగలతో ఈ వరండా కొలతలేమిటి?" అన్న సమీనా మాటలకు వెనుదిరిగి చూసింది సకీనా. ఏడ్చిఏడ్చి ఉండడం వల్ల ఆమె కళ్లు ఉబ్బి ఎర్రగా తయారయ్యాయి. సమీనాను చూసి మళ్లీ సాగరాలుగా మారాయి.

"ఈ నీ ఎర్రసాగర ప్రవాహానికి ఎవరో ఒకరు కొట్టుకుపోతారు." సకీనా మనసు మనసులో ఉంటేగా సమీనా మాటల్ని పట్టించుకోడానికి ఆమె దుఃఖాన్ని నిగ్రహించుకోలేక సమీనాను గట్టిగా వాటేసుకుంది.

సమీనా ఆమెను ఓదార్చింది.

"పొద్దున నువ్వొచ్చి వెళ్లిన దగ్గర్నించి, ఒంటరిగా కూర్చొని ఏడుస్తూనే ఉన్నాను. నా దురదృష్టం ఏమిటో, ఏమో!"

"నువ్వస్తమానం ఇలా ఏడుస్తూ కూచుంటే ఎలా? గుండె దిటువు చేసుకోవాలి. కష్టాలు, కన్నీళ్లు మనుషులక్కాకపోతే మానులకొస్తాయా?... సరేగానీ ఈ రోజు జలీల్ భాయి ఇంటికెళదాం."

"ఎందుకు..?" కాస్త కుదుటపడి, కన్నీళ్లు తుడుచుకుంటూ అడిగింది. సకీనా "ఈ రోజక్కడికి ఖాలిదా ఆపా వచ్చారు."

"ఆమెవరు..?'

"ఖాలిదా పర్వీన్ అని... వరంగల్ ఆమెది. ఓ ప్రముఖ ధార్మిక సంస్థలో మన ఆంధ్ర రాష్ట్రానికి సందేశ విభాగంలో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారామె. ఆమె చక్కని ఉపన్యాసం చేస్తుంది. చిలుక పలుకుతున్నట్లుగా, బుల్‌బుల్ పిట్ట మాట్లాడుతున్నట్లుగా కోయిల కూస్తున్నట్లుగా వీనుల విందుగా ఉంటుంది ఆమె ఉపన్యాసం.

జలీల్ భాయి ఇంట్లో ఈ రోజు ఆమె ఉపన్యాసం ఉంది. ఆ విషయమే చెప్పిపోదామని వచ్చాను. నీకు టైంపాసూ అవుతుంది. నాలుగు మంచి మాటలు విన్నట్లూ ఉంటుంది. ఏమంటావు?"

"నువ్వు చెప్పాక ఇంకా ఏమనేది కూడా ఉంటుందా? మరి టైమెప్పుడో...?"

"మగ్రిబ్ తర్వాత భోజనాలు గీజనాలు చేసి బయల్దేరదాం."

"తప్పకుండా వెళదాం. నలుగురిలో కలుస్తూ ఉంటే బాధలన్నా మర్చిపోవచ్చు."

సమీనా వెళ్లిపోగానే ఇల్లంతా సర్దేసి, కాస్త అన్నం వండింది. మగ్రిబ్ కంటే ముందే భోజనం ముగించి బట్టలు మార్చుకుంది. మగ్రిబ్ నమాజు చేసుకుని పాపను తడిగుడ్డతో శుభ్రంగా తుడిచి బట్టలు మార్చింది. ఎందుకైనా మంచిదని రెండు గౌన్లు, రెండు టవళ్లు చిన్న హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుంది.

'సమీనా కూడా తయారై ఈమెను పిలుస్తూనే, బురఖా వేసుకొని బయలుదేరింది. ఇద్దరూ కలిసి ఆటోలో జలీల్ గారింటికి చేరుకునేసరికే ఉపన్యాసం మొదలైంది.

ఖాలిదా ఆపా ఉపన్యాసం మంచి జోరుగా సాగుతోంది. సకీనా చకోర పక్షిలా నోరెళ్లబెట్టి ఆమె ప్రసంగాన్ని శ్రద్ధగా వింటోంది.

"..స్త్రీ చాలా నాజూకైనదని, అబల అని ఎవరన్నారోగాని అది తప్పు. దాన్ని నేనొప్పుకోను. ఆమె పొడవాటి కురులను చూసి, గులాబి రెమ్మల్లాంటి ఆమె బుగ్గలను చూసి, ఆమె సున్నితమైన బాహువులను చూసి, ప్రేమామృతం నిండిన ఆమె చూపులు చూసి... ఆమె ముగ్ధమనోహర సౌందర్యాన్ని చూసి, మృదుమధురమైన తేనెలొలికే ఆమె పలుకులు చూసి, ఆమె బలహీనురాలని, అతి నాజూకైనదని తప్పుడు అంచనా వేశారు. ప్రియ సోదరీమణులారా! దైవసాక్షిగా చెబుతున్నాను. చూపులకలా అనిపించ వచ్చునేమోగాని, స్త్రీ అబల కాదు, బలహీనురాలు కాదు. ఆమె సబల- అవును, ఆమె బలహీనురాలు ఎంతమాత్రం కాదు. ఆమె శక్తి అపారమైనది. ఆమె స్థిరత్వం ముందు పురుషులు బలాదూర్ అని నేనంటాను. పురుషులు ఏ కాస్త దానికీ ఓర్చుకోలేరు. చిన్న చిన్న విషయాలకే బెదిరిపోతారు. అసహనంపాలు వారిలో ఎక్కువ. కాస్త కూరలో ఉప్పు తక్కువైతే చూడాలి వారి ప్రతాపం. ఇంట్లో ప్లేట్లన్నీ బయటపారేసే మగవాళ్లనెందరిని చూడటం లేదు మనం.

ఇదీ మగమారాజుల బలం, వారి నిగ్రహస్థాయి! 'ఏమండీ! నేను ఫలానా వస్తువు తెమ్మన్నానుగా తేలేదే? 'అని అడిగి చూడండి. ఏమవుతుందో? వారి అభిప్రాయాలకు, వారి భావాలకు అనుగుణంగా

లేని ఏ మాటనూ వారు భరించలేరు, అసహనానికిలోనై ఇల్లు పీకి పందిరేస్తారు. భార్యాపిల్లలపై విరుచుకుపడతారు. చూడండి మరి! వాళ్ల ఎంతబలవంతులో, ఎంత ఆలోచనాపరులో, ఎంతటి నిగ్రహం, శక్తి సామర్థ్యాలు కలవారో? ఇలాంటి మగరాయుళ్లా ఆడదాన్ని అబల అనేది? 'అమ్మలారా! అక్క చెల్లెళ్లారా! మిమ్మల్ని మీరు గుర్తించండి. మీ శక్తి సామర్థ్యాలను గుర్తించండి. అవును, మీరు మీ పిల్లల ఆలనా పాలనా చూస్తారు. వాళ్లు ఒంటికీ రెంటికీ పోతే ఎత్తిపోస్తారు. సమర్థవంతంగా వారి బాగోగులు చూస్తారు. అయినా అలసిపోరు. విసుక్కోరు. భర్త ఛీత్కారాలను భరిస్తారు. నోటికొచ్చినంత మాట్లాడినా మేరు పర్వతంలా మౌనంగా భరిస్తారు. పిల్లలతో వేగడం మీకు బరువుకాదు, భుజస్కంధాలపై కుటుంబ భారం మోయడం, ఇంటి సంరక్షణ మీకు భారం కాదు. భర్త గౌరవ మర్యాదలు కాపాడడం మీకు నామోషీ కాదు. కాని పరపురుషునితో ఓసారి మాట్లాడి చూడండి. మీ భర్తలో ఉన్న సహనమెంతో మీకే తెలుస్తుంది. అవును, నేను మరో అడుగుముందుకేసి -బాహ్యంలో స్త్రీ అబలే కావచ్చు. కాని అంతర్యంలో వాస్తవంగా ఆమెకంటే స్థిరచిత్తురాలు మరెవరూ లేరంటాను. అవును, స్త్రీ శక్తిసామర్థ్యాలను అంచనావేయడం వీరి తరమా?

దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాంను దైవం హిజ్రత్ చేయమని ఆదేశించినప్పుడు ఒక స్త్రీ ఆయనకెలా తోడ్పడిందో ఓసారి చూడండి. ఇది ఈనాటి మాట కాదు.

నేటికి దాదాపు ఐదు వేల సంవత్సరాల క్రితం ఆనాడు ప్రపంచం ఎలా ఉండేదో ఊహించండి. మేడలు మిద్దెలు లేవు, ఆకాశ హర్మ్యాలు

లేవు. పచ్చని చేలూ, పంట పొలాలూ లేవు. బస్సులు, రైళ్లు, విమానాలు ఏమిటో తెలియదు. విస్తారమైన రోడ్లు వీధి బజార్లు ఏమీ లేవు.

ఎటు చూసినా దుర్గమ మార్గాలే. ఎటు చూసినా ఇసుక ఎడారులే. అనంతమైన సముద్ర సాగరాలు. అత్యంత భయానకమైన మార్గాలు. విసిరేసినట్లుగా ఉండే పల్లెలు. కాని ఎక్కడెక్కడికి దేవుని ప్రియప్రవక్త వెళ్లారో, అక్కడికల్లా ఆమె కూడా వెళ్లింది. 'ప్రజలారా! వినండి, మీ దేవుడు ఒక్కడే' అన్నప్పుడు అడుగులో అడుగేసి మొట్టమొదట విశ్వాసాన్ని బలపరచి ఆయన గొంతుతో గొంతు కలిపింది ఆ స్త్రీయే. నేటికి ఐదువేల సంవత్సరాలకు పూర్వమే ఆమె ఇసుక ఎడారుల్ని, అనంత సముద్రాలను దాటింది. అడవిలో నడిచింది. గుట్టలను ఎక్కింది, దిగింది. దేవుని ప్రవక్త సహించిన కష్టాలన్నిటిలో ఆమె భాగం పంచుకుంది. కాని ఏనాడూ ఆమె నోటి నుండి ఎలాంటి కంప్లయింటూ వెలువడలేదు.

తరువాత ఇదే అబల ఈజిప్ట్ వెళ్లినప్పుడు ఈమె అందచందాలను గురించి, ఈమె అతిలోక సౌందర్యాన్ని గురించి తెలుసుకున్న ఈజిప్ట్ చక్రవర్తి ఆమెను బంధించి తెప్పించాడు. ఇక ఏం చెప్పమంటారు, ఆ మగమహారాజు ధైర్యస్థయిర్యాలు? పిచ్చెక్కిన వ్యామోహంతో రాజు తన బాహువుల్ని ఆమె వైపు చాపినప్పుడు, ఆ స్త్రీ క్రోధాగ్నితో చూసిన ఒక్కచూపుకు రాజుకు దిమ్మదిరిగిపోయింది. బాహువులు చచ్చుబడిపోయాయి.

అవును, ప్రియ సోదరీమణులారా! ఇవి నా మాటలు కావు. స్వయంగా దైవమే సాక్ష్యమిచ్చిన సంఘటన ఇది. అయినప్పటికీ ఆడది అబల అని, బలహీనురాలని అనే వాళ్లను అననీయండి.

కాని మీరు మీ శక్తిసామర్థ్యాలను గుర్తించండి. మీరు గనక

మగవాడికి సహకరించకపోతే అతడేమీ చేయలేడు. స్త్రీ సంపూర్ణ సహకారం లేకుండా మగవాడు ఏమీ సాధించలేడు.

ఒకవేళ మీ పురుషులు దైవధర్మ సంస్థాపనలో, దైవసందేశ ప్రచారంలో నిరంతరం శ్రమిస్తుంటే మీరు వారికి సంపూర్ణ సహకారమందించండి. ఏ విధంగానయితే మనందరి మాతృమూర్తి హజ్రత్ ఖతీజతుల్ కుబ్రా (ర.అన్హా) దైవప్రవక్త ముహమ్మద్ సల్లం వారికి సహకరించారో ఆ విధంగా సహకరించండి.

దైవ సందేశ మార్గంలో మీ పురుషులు బయటికెళ్లినట్లయితే మీరు మీ కుటుంబ బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించండి. ఇంటిని సంరక్షించండి..."

'సంరక్షణా-?' ... సకీనా ఖాలిదా ఆపా వైపే తదేకంగా చూస్తూ ఆమె ప్రసంగాన్ని శ్రద్ధగా వింటోంది. కాని "పురుషుడు ఇంట్లో లేనప్పుడు ఒక స్త్రీ ఇంటిని ఎలా కాపాడగలదు" అనే ఆలోచనలో పడిపోయింది. ఖాలిదా ఆపా అనర్గళ ప్రసంగం ఆమె చెవులకు తూటాల్లా తాకుతున్నప్పటికీ ఆమె ఏం చెప్పిందో తెలియనంతగా ఆలోచనల్లో కూరుకుపోయింది.

సమావేశం ముగిసిన తర్వాత ఇంటికి తిరిగొస్తూ - 'ఒకవేళ ఎవడైనా తుంటరి వెధవ తన ఇంట్లోకి దూరితే వాడి నెదుర్కోవడం ఎలా..?' అని ఆలోచిస్తోంది.

'అన్నా! బాగా పొద్దుపోయింది. ఆటో కాస్త త్వరగా పోనియ్' అన్న సమీనా మాటలకు ఈ లోకంలో కొచ్చింది సకీనా.

"మీకేమీ భయం లేదమ్మా! నేను తీసుకువెళతాగా!" అంటూ డ్రైవర్ కాస్త వేగం పెంచాడు.

నటరాజ్ సెంటర్‌దాటి యూష్ కాలనీ వైపు ఆటో దూసుకుపోతోంది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఓ టర్నింగ్ దగ్గర బాగా చీకటిగా ఉంది. సరిగ్గా అక్కడే ఆటో స్లో కావడం, కొందరు దుండగులు ఆటోను అడ్డగించడం జరిగిపోయింది.

దుండగులు ఆటో డ్రైవర్‌ను కత్తులతో బెదిరించి, స్త్రీలను కిందికి లాగబోయారు. ఆడవాళ్లిద్దరికీ ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు, తమ కాళ్లకింది భూమి కంపించిపోతున్నట్లు అప్రయత్నంగానే ఆటోలోంచి కిందికి దిగేశారు. కళ్లు చించుకున్నా కానరాని చీకటి, ఇద్దరూ ఆడవాళ్లు, సకీనా సంకలో పాప. చుట్టూ నిర్మానుష్యం. దూరంగా ఎక్కడో ఇళ్లు, కాని అవి కానరావు, తమ కేకలు ఎవరికీ వినిపించవు. ఓ అల్లాహ్! ఇప్పుడెలా?

అకస్మాత్తుగా పక్కనుండే ఓ కేక వినబడింది. 'ఖబర్దార్! ఎవ్రా మీరు? ఆ స్త్రీలపై చేయిపడితే మీ శవాలు కూడా మిగలవు' అంటూ ఓ ఆజానుబాహుడైన వ్యక్తి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అతడి వాలకం చూస్తే బాగా కండలు తిరిగి కరాటే ఫైటర్‌లా ఉన్నాడు. కాసేపట్లోనే ముగ్గురు గూండాలు అతడి ధాటికి తట్టుకోలేక పలాయనం చిత్తగించారు.

"పిరికి వెధవలు, ఉన్నట్లయితే పచ్చిరక్తం తాగే వాణ్ణి. పోండి, వెధవల్లారా! మీ అమ్మల దగ్గరికి, మీ అక్కచెల్లెళ్ల దగ్గరికి వెళ్లండి" అంటూ బిక్కుబిక్కుమంటూ ప్రాణాలరచేతిలో పెట్టుకొని నిలుచున్న ఆడవాళ్లను సమీపించాడు.

"అన్నా! దేవుడు నిన్ను చల్లగా చూడాలి. నీ అక్క చెల్లెళ్ల గౌరవ

మర్యాదలు కాపాడాలి! మా కోసం దైవం పంపిన దూతవు నువ్వు. సమయానికొచ్చి మమ్మల్ని కాపాడావు. లేకపోతే...."

"అమ్మా! మీరేమీ భయపడకండి. మిమ్మల్ని మీ ఇంటి దగ్గర దించే పూచీ నాది."

"భయ్యా నీ పేరేమిటి? మమ్మల్ని దైవ దూతలా కాపాడావు" అడిగింది సమీనా.

"నా పేరు నజీర్. మీర్జా గాలిబ్ గారి అబ్బాయిని. ఇక్కడే ప్రశాంత్ నగర్‌లో ఉంటాను". ముక్తసరిగా సమాధానమిచ్చాడు నజీర్.

"దైవం మీకు మరిన్ని సత్కార్యాలు చేసే భాగ్యం ప్రసాదించాలి. మేము నీ మేలు ఎన్నటికీ మరచిపోము" అన్నది సమీనా కృతజ్ఞతగా.

నజీర్ స్వయంగా ఆటో నడుపుతూ వారిని క్షేమంగా ఇల్లు చేర్చాడు. ఆడాళ్లిద్దరూ దారి పొడవునా అతని మంచితనాన్ని పొగుడుతూ, అతని కోసం ప్రార్థిస్తూనే ఉన్నారు. ఇళ్లకు చేరిన ఇద్దరు స్త్రీలు అతనికి మరీ మరీ కృతజ్ఞతలు తెలిపారు. నజీర్ ఇదేమంత గొప్పేం కాదన్నట్లుగా ముక్తసరిగా రెండు ముక్కల్లో చెప్పేసి వినయంగా వెళ్లి పోయాడు. అతని జ్ఞాపకాలను వదిలేసి.

★ ★ ★

"గురూ! ఎలా పారింది మన పాచిక."

"ఒహ్హో... సూపర్ డూపర్."

"కాని గురూ! నీ వీర బాదుడికి నా ఒళ్లంతా పచ్చిపుండయింది."

"తప్పదమ్మా... ఇంత పెద్ద ప్లాన్ సక్సెస్ కావాలంటే ఇలాంటి పాట్లు తప్పవు మరి."

"సరే, పాచిక బ్రహ్మాండంగా పారిందిగాని, చిలక పంజరంలో చిక్కిందామరి...?"

అరెరే... ఏమిటా తొందర... ఇప్పుడే గదా మచ్చు చల్లింది. ఇకగాని వల పరవను.."

"అదే... ఎప్పుడు పరుస్తావూ అంటున్నాను."

"ఎప్పుడో ఎందుకు ఇప్పుడే..."

"ఓర్నీ... ఇప్పుడే..? ఎలా?"

"ఎలా అంటే..., ఇప్పుడు నువ్వు మీ చింటూ గాడి ద్వారా (అదే, మీ చిన్నబ్బాయి) నేను పంపించానని చెప్పి కొన్ని బట్టలు పంపుతావు. నేనిచ్చానని చెప్పి, కుట్టుకూలి రెట్టింపు ఇవ్వాలి సుమా! బట్టలు తయారైన తర్వాత తీసుకురావడానికి నేను వెళతాను. అప్పుడు చూద్దువుగాని నా తడాఖా..."

"ఆహా...! ఎంత ప్లాన్డ్‌గా వల పన్ని, చిన్నచిన్నగా ఉచ్చు బిగిస్తున్నావు గురూ?"

"చిలక వలపై వాలి స్వయంగా తన ముక్కుతో ఉచ్చు బిగిస్తుంటే ఎంత మజాగా ఉంటుందో తెలుసా?

"నీ పాచికే అలాంటిది మరి. నీ బుర్రే బుర్ర.. చిలక స్వయంగా తనంత తానుగా వలపై వాలేలా చేశావు. నిజమే కదా మరి. పాపం!

నువ్వామెను గూండాల బారి నుండి రక్షించావు! నువ్వు చేసిన మేలును ఏ స్త్రీ మాత్రం మరుస్తుంది? ఆమె దృష్టిలో నువ్వొక మహిళోద్ధారకుడివేకాదు, దైవదూతవి కూడా!!"

"హి హి హి.. అనూ.. అనూ.. ఎన్నయినా అను,

నేను కథను రక్తి కట్టించానా లేదా?"

"ఓ అద్భుతంగా.. సరే మరి నేను బయలుదేరుతా.. బట్టలు కొనుగోలుకు డబ్బులు..."

"డబ్బులు కాదు.. నోట్లు... కట్టలు.. కట్టలు... నీ మామూలు కూడా ఇందులోనే ఉన్నాయి" అంటూ నజీర్ వెయ్యి రూపాయల నోట్ల కట్టను అందించాడు.

గుల్జార్, నజీర్ వద్ద నోట్ల కట్ట తీసుకొని నేరుగా 'సుమంగళి క్లాత్ షోరూమ్' కొత్తగూడెం వెళ్లాడు. అక్కడ నజీర్ కోసం అతి ఖరీదైన బట్టలు కొనుగోలు చేసి, పనిలోపనిగా తనకూ తన భార్యాపిల్లలక్కూడా కొనేశాడు.

వెంటనే ఇంటికి తిరిగొచ్చి, చిన్నబ్బాయి చింటూను పిలిచి, ఎక్కడికెళ్లాలో, ఎలా వెళ్లాలో, ఏం చెప్పాలో అన్నీ సవివరంగా ఒకటికి రెండుసార్లు బట్టీ పట్టించి సకీనా ఇంటికి పంపాడు.

చింటూ అక్కడికి వెళ్ళేసరికి సకీనా, సమీనా లిద్దరూ రాత్రి జరిగిన సంఘటనే చర్చించుకుంటున్నారు. దైవానికి కృతజ్ఞత తెలుపుతూ నజీర్ మంచితనాన్ని, అతడి సచ్ఛీలతను పొగుడుతూ అతడి కోసం ప్రార్థిస్తున్నారు.

చింటూ వారి వద్దకెళ్లి, ఈ బట్టలు నజీర్‌గారు పంపించారని, ఈ పైకం కూడా మీకిమ్మన్నారని బట్టల కవరు, పైకం వారికందించాడు.

"నజీర్‌గారు ఎల్లుండి వస్తామన్నారు. అప్పటికల్లా తయారైతే తీసుకెళతారు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

కవరు విప్పగానే అందులో కొలతల చిట్టీ కూడా ఉంది. ఆడాళ్లిద్దరూ పరమానంద భరితులయ్యారు. సకీనా కూడా చాలా రోజులుగా ఖాళీగానే ఉంటోంది. ఇప్పుడు చేతినిండా పని దొరికింది. సకీనా మరోసారి దైవానికి కృతజ్ఞతలు తెలుపుకొంది. నజీర్ పట్ల కూడా ఆమె మనసులో ఓ ప్రత్యేకమైన అభిమానం గూడు కట్టుకొంది. అలా ఆమె నజీర్ అభిమానపాత్రురాలైంది.

మరికాసేపు మాట్లాడుకున్న తర్వాత సమీనా వెళ్లిపోగానే సకీనా నజీర్ పంపిన బట్టలు కొలతల ప్రకారం కట్ చేసుకొని శ్రద్ధగా కుట్టసాగింది.

కాసేపటి తరువాత సమీనా, ఆమె భర్త ఖాన్‌సాబ్ సకీనా ఇంటి కొచ్చారు. వెళ్లిన కాసేపటికే సమీనా భర్తను వెంటేసుకురావడం సకీనాను ఆశ్చర్యపర్చింది. ఖాన్ సాబ్‌ను చూసి సకీనా ఇంట్లోకి వెళ్లిపోయింది.

సమీనా నేరుగా ఇంట్లోకెళ్లి, 'మీ అన్నయ్య మనతో ఏదో మాట్లాడాలని ఇంట్లోకి కూడా రాకుండా నేరుగా ఇక్కడికే తీసుకొచ్చారు' అని చెప్పింది సమీనా. ఖాన్ సాబ్ బయట అరుగు మీద కుర్చీలో కూర్చున్నారు. సకీనా, సమీనాలు ఇంట్లో సెటిలయ్యారు. సకీనాకు ఆసక్తిగా ఉత్కంఠగా ఉంది. విషయం ఏమిటో అర్థం కాలేదు.

కొద్దిసేపు మౌనం- చివరికి ఖాన్ సాబే వెళ్లబెట్టారు- "ఊఁ రాత్రి జరిగిన విషయమేమిటో ఓసారి చెప్పండి" అన్నారు.

"జలీల్ భాయి ఇంట్లో ఇజ్తెమా ఉందని, ఖాలిదా ఆపా వచ్చారని తెలిసి అక్కడికెళ్లాం. ఆటోలో తిరిగొస్తుంటే గూండాలు ఆటోను అడ్డగించి

మాపై అఘాయిత్యం చేయబోయారు. అప్పుడు నజీర్‌భాయి ఒక ఫరిస్తాలా వచ్చి మమ్మల్ని కాపాడాడు. మాకెలాంటి ప్రమాదం లేకుండా ఇంటి వరకూ చేర్చి వెళ్లాడు."

ఊఁ!...అని ఖాన్‌సాబ్ ఓసారి గట్టిగా శ్వాసపీల్చి ఇలా అన్నారు.

"ఆ నజీర్ గురించి బహుశా మీ ఇద్దరికీ తెలియదు. వాడితో కాస్త జాగ్రత్తగా ఉండాలి."

"అదేమిటీ అలా అంటారు. అతడు చాలా మంచివాడు. ఎలాంటి లాలూచీ లేకుండా మమ్మల్ని దుండగుల బారి నుండి రక్షించాడు. దారిలో కూడా ఎంత సైలెంట్‌గా, ఎంత హుందాగా ఉన్నాడో తెలుసా? కనీసం సరదాకైనా పాపం అతడు ఏ మాటా మాట్లాడలేదు. అంత మంచివాణ్ణి పట్టుకుని మీరెందుకలా అనుమానిస్తున్నారు?" అన్నది సమీనా.

"అనుమానం కాదు. అక్షరాలా నేనతణ్ణి ఎరుగుదును. వాడొక గూండా- గూండానే కాదు, గూండాల నాయకుడు. వాడి ఈ సానుభూతి వెనుక కూడా ఏదో దురుద్దేశం ఉంది. ఇప్పుడేవో బట్టలు కూడా పంపించా డని తెలియగానే- అమ్మో, వాడేదో సకీనా కోసం వల పన్నుతున్నాడని అర్థమైంది. ఈ విధంగా సానుభూతి, కనికరం చూపుతూ, సహాయం, సహకారమందిస్తూ సకీనా మనసు దోచుకోవాలనుకుంటున్నాడు. తనను పల్లెత్తు మాట కూడా అనకుండా, ఇష్టపూర్తిగా సకీనా తనకు లొంగిపోయేలా చేయడమే ఈ సహాయం, సానుభూతుల వెనుక ఉన్న అసలు ఉద్దేశం."

"హాయ్ అల్లాహ్!" ఇద్దరి నోటి వెంటా ఒకేసారి నిట్టూర్పు వెలువడింది.

"మాకేం తెలుసు ఈ మగాళ్ళ దుర్బుద్ధులు, బజార్లెంట తిరిగే వాళ్లకు అన్నీ తెలుస్తాయి. బయట మాకేం పని, అవసరముంటే బయటికెళతాం లేకపోతే, మా పనేమిటో మేమేమిటో-"

"సరే- నాకు తెలిసింది నేను చెప్పాను. చెప్పడం నా బాధ్యత కదా!"

"మరీ బట్టలు ఏం చెయ్యాలి? కుట్టుకూలి కూడా సాధారణ రేటుకంటే ఎక్కువగానే పంపించాడు. వాస్తవంగానైతే నేను అతడు బట్టల కోసం వచ్చిన రోజు టీ, టిఫిన్ ఏర్పాటు చేసి మర్యాద కూడా చేద్దామనుకున్నాను. ఎందుకంటే అతడు చేసిన మేలు అలాంటిది మరి" అన్నది సకీనా.

"సరే- నువ్వైతే బట్టలు కుట్టు. ఎల్లుండి నేను డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటాను. అతడొచ్చినప్పుడు నన్ను కూడా పిలిస్తే అతడి అతిథి మర్యాదల వ్యవహారం నేను చూసుకుంటాను.

ఎలాగూ పక్కన మా అండ కూడా ఉందనే విషయం అతడికి తెలిసిపోతుంది. తరువాత ఇక అతడు నీ జోలికి రావాలంటే మాత్రం ముందు నా అడ్డు తొలగించుకోవాల్సి ఉంటుందతడికి."

"అయ్యయ్యో! ఈ అభాగ్యురాలిని గురించి మీ ప్రాణాల మీద కొచ్చేలా ఉంది పరిస్థితి. దైవం మిమ్మల్ని కాపాడాలి. నా రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది. నా కోసం మీరు ప్రాణాల మీదికి తెచ్చుకోకండి."

"అయితే పొరుగున ఉండీ ఒక నిస్సహాయ స్థితిలో ఉన్న స్త్రీని అలాగే వదిలేయాలా? రేపు నేను దైవానికి, దైవప్రవక్తకు ఏ ముఖం చూపించాలి. అసలు పొరుగువారి హక్కులేమిటో మీ ఇద్దరికీ తెలుసా?"

ఈ ఊహించని విషయాలు ఒక్కసారిగా ముందుకొచ్చేసరికి సకీనా తీవ్ర భయాందోళనలకు గురైంది. ఆమె గుండె వేగం పెరిగింది, రక్త ప్రసరణలో మార్పులొచ్చాయి. పరిస్థితి గమనించిన సమీనా ఆమెను మంచంపై పరుండబెట్టి, భర్తను పిలిచింది.

ఖాన్‌సాబ్ లోనికొచ్చి! 'ప్రమాదకర పరిస్థితులు కళ్ల ముందు కదలాడేసరికి ఈమె తట్టుకోలేకపోయిందని, పాపను ఆమె గుండెలపై పడుకోబెట్టమని సలహా ఇచ్చాడు. ఏమీ కాదని, ధైర్యం చెప్పి ఎందుకైనా మంచిదని వెళ్లి డాక్టర్ జీలానీ గారిని వెంటబెట్టుకొచ్చారు.

డాక్టర్ జీలానీ ఆమెను పరీక్షించి, బి.పి. చెక్ చేశారు. ఒక్కసారిగా భయానికి లోనుకావడం వల్ల ఇలా జరిగిందని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు.

బ్యాగ్‌లోంచి -ఒక విట్ న్యూరిన్ ఇంజెక్షన్ తీసి ఆమెకు ఐ.వి. ఇచ్చారు. కాసేపటికి కాస్త కళ్లు తెరిచిన సకీనా అక్కడి దృశ్యాన్ని చూసి అవాక్కయింది. ఎదురుగా ఖాన్‌సాబ్, డాక్టర్ జీలానీ, సకీనా కళ్లు తెరవగానే ఇద్దరు మగవాళ్లు బయటికెళ్లారు. సమీనా ఆమెకు సపర్యలు చేస్తూ అంతా వివరించింది.

మరి కాసేపు అక్కడే ఉండి ఆమె కుదుట పడ్డ తర్వాత, "ఏ కాస్త అవసరమైనా వెంటనే పిలవమని చెప్పి సెలవు తీసుకొని వెళ్లిపోయింది సమీనా. సకీనా పరధ్యానంగా ఆమె వెళ్లిన వైపు అలానే చూస్తూ కూర్చుండి పోయింది.

★ ★ ★

"ఎల్లుండి" - అదే, నజీర్, సకీనా ఇంటికెళ్లే రోజు రానేవచ్చింది. రీకు రాకుగా తయారై కొన్ని స్వీట్లు, పళ్లు ఫలాలు తీసుకొని ఈలపాట పాడుకుంటూ హుషారుగా వెళుతున్నాడు నజీర్.

అతడి మనసంతా 'సకీనా ఊహలతో నిండిపోయి వుంది. తాను వెళ్లేసరికి సకీనా ఒంటరిగా ఉంటుంది. తాను వెళ్లగానే ఆప్యాయంగా తలుపుతీస్తుంది. 'భయ్యా భయ్యా' అంటూ అభిమానం కురిపిస్తుంది. తను తీసుకెళ్లిన స్వీట్లు, పళ్లు ఫలాలు ప్రేమతో అందుకుంటుంది, పరాయితనం దూరమవుతుంది. సన్నిహితం పెరుగుతుంది. -అదికాస్తా 'ప్రేమ'గా మారుతుంది. తరువాత ఇక అతడు ఊహించలేకపొయ్యాడు. మనసంతా సంతోషంతో నిండిపోయింది. అంతలో ఇల్లురానే వచ్చింది.

నజీర్ గబగబా వెళ్లి తలుపుతట్టగానే ఖాన్‌సాబ్ 'అస్సలాము అలైకుం' మీరు నజీర్‌గారు కదూ రండి రండి అంటూ ఆహ్వానించారు. ఖాన్‌సాబ్‌ను చూస్తూనే నజీర్ చల్లబడిపోయాడు. అతడి ఉత్సాహమంతా ఆవిరై పోయింది. అప్పటి వరకూ హుషారుగా కళకళలాడిన ముఖం కత్తి కటుకు నెత్తురు చుక్కలేనట్లుగా పాలిపోయింది.

అయినా అదేమీ కనబడనీయకుండా యాంత్రికంగా ఆయన సలాముకు జవాబు పలికి ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాడు. తరువాత ఒక్క క్షణం తీవ్రంగా ఆలోచించిన నజీర్ 'ఇవి మా చెల్లెమ్మకు అందించండి' అంటూ తాను తెచ్చిన స్వీట్లు, పళ్ల కవరును ఖాన్‌సాబ్‌కు ఇచ్చాడు చిరునవ్వుతో.

"మాషా అల్లాహ్! సకీనా మీ చెల్లాయా? సకీనా మాకెప్పుడూ ఈ విషయం చెప్పనేలేదు. నాకైతే అసలు ఎవరూ లేరనే చెప్పింది. భర్త ఉన్నాడు

గానీ, ఆ అభాగ్యుడు అమ్మాయి పుట్టిందని బెదిరించి ఎటో వెళ్లిపోయాడు. ఇంతకూ సకీనా మీకు ఎలా చెల్లెలవుతుంది?" ఖాన్ సాబ్ నజీర్‌ను ప్రశంసిస్తూ ఆసక్తిగా అడిగారు.

"మీరు నాకెలా సోదరులవుతారో, అలాగే ఆమె కూడా చెల్లెలవుతుంది."

"మాషా అల్లాహ్! ధార్మిక బంధుత్వం- ఇస్లామీ రిష్త."

మీరు మొన్నీమధ్య వీళ్లకు చేసిన సహాయాన్ని గురించి విని చాలా సంతోషించాను. మీలాంటి మంచివాళ్లు ఈనాటి సమాజానికి చాలా అవసరం. సకీనా వెంట ఉన్న ఆమె మా ఆవిడే. మీ గురించి చాలా చెప్పింది. మేము ఈ పొరుగునే ఉంటాం" అంటూ "మీరివన్నీ ఎందుకు తెచ్చారూ?" అంటూ స్వీట్లు, ఫలాల పాకెట్ లోనికి తెసుకెళ్లారు.

లోపల సకీనా, సమీనాలిద్దరూ తమ ఉపకారికి ఆతిథ్యమివ్వడానికి రెండు మూడు రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఈ రోజు నజీర్ ఏం మాట్లాడుతాడో, అతని ప్రవర్తన ఎలా ఉంటుందోనని ఎవరికి వారు మనసుల్లోనే అనుకుంటున్నారు.

వంటలన్నీ పూర్తయ్యాక దస్తర్‌ఖాన్‌పై అన్నీ సర్ది, ఖాన్ సాబ్‌కు సిగ్నల్ ఇవ్వగానే ఆయన నజీర్‌ను లోనికి ఆహ్వానించారు.

ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుతూ వంటకాలను రుచి చూస్తున్నారు. మాటల సందర్భంలో- తాము పెద్ద బంజర్‌దారులమని, తమ వంశం చాలా గొప్పవంశమనీ ఇంకా ఏవేవో ఒకటికి నాలుగు కలిపి పెద్ద పెద్ద కోతలు కోశాడు నజీర్.

ఖాన్‌సాబ్ అతడు చెప్పే ప్రతి మాటకూ చాలా చక్కగా హుందాగా స్పందిస్తూ అతడి మనస్తత్వాన్ని అంచనా వేయసాగారు. "మా కాలనీలో కూడా కొందరు బంజరుదారులున్నారని, అందరూ చాలా మంచివారని-సకీనా అంటే అందరికీ ఎక్కడలేని అభిమానమనీ" ముక్తాయింపునిచ్చారు.

"ఇలాంటి అసహాయుల పట్ల సానుభూతి చూపడం అందరి బాధ్యత. మా చెల్లాయి భర్త ఎటో వెళ్లిపోయాడని నాకారోజే తెలిసింది. తెలిసిన వెంటనే సకీనాకు ఏదో ఒక సాయం చేయాలని నేను ఆనాడే నిర్ణయించుకున్నాను. అందుకే కొన్ని బట్టలు కూడా పంపించాను కుట్టడానికని" అంటూ అభిమానం వ్యక్తం చేశాడు నజీర్.

"అవునవును- బట్టలు పంపడమే కాదు, కుట్టుకూలి కూడా రెట్టింపు పంపారట. ఈ రోజు మీరు తెచ్చిన అన్నన్ని స్వీట్లు, అన్నన్ని పళ్లు ఫలాలు చూస్తేనే మీ మంచితనం అర్థమయిపోతుంది" అన్నారు ఖాన్‌సాబ్.

"దుఃఖ హృదయాల సాంత్వన కోసం మానవుణ్ణి పుట్టించాడు దైవం. లేకపోతే ఆయన దాస్యానికి దైవదూతలు కరువా?" అంటాడు మహాకవి గాలిబ్.

"వాహ్ నజీర్ భాయ్! మీకు గాలిబ్ కవితలు కూడా తెలుసా."

"అవును, బాధల్లో ఉన్న వారిని మనం ఆదుకోవాలి. ఆదుకోవడంలో, సానుభూతి చూపడంలో చిత్తశుద్ధి, దైవప్రసన్నత ఉన్నట్లయితే దాని ప్రాముఖ్యత అనంతంగా పెరిగిపోతుంది."

"సరే నేనైతే చిత్తశుద్ధి, దైవప్రసన్నత లాంటి పెద్దపెద్ద మాటలైతే చెప్పలేనుకాని, నాకు సాధ్యమైనంత వరకు ఇతరులకు సాయం చేయడానికి ప్రయత్నిస్తాను. సాయం చేసి మనసులో సంతోషిస్తాను."

"దేవుడు మీకు ఇంత చక్కని మనసిచ్చాడు. మీరు దైవానికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి."

"అదే- నా మాటల అర్థం కూడా అదే ఖాన్ సాబ్."

"అరెరే... ఏమిటీ మాటల్లో పడి ఆపేశారు. ఇదిగో ఇది కొద్దిగా తీసుకోండి. ఈ దోసకాయ చాలా బాగుంది. సకీనా స్వహస్తాలతో వండింది" అంటూ కాస్త వడ్డించారు ఖాన్‌సాబ్.

"నేను చాలా తృప్తిగా తింటున్నాను. ప్రతి వంటకంలో రుచితోపాటు అభిమానం ఉట్టిపడుతోంది."

"ఇదిగో ఈ పుల్కాలు మా ఆవిడ చేసింది."

"వా...వాహ్... ఇద్దరూ నన్ను చాలా గొప్పగా, మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఎంత గొప్ప ఆతిథ్యం...!"

"నజీర్ భాయ్! మీరు వాళ్లకు చేసిన ఉపకారం ముందు ఇది ఏ పాటి? ఇదే మాట వాళ్లు మాటిమాటికీ అంటుంటారు. నేను కూడా మీ మేలు మరచిపోలేను."

"ఇందులో నేను చేసిన మేలేముంది చెప్పండి. నా స్థానంలో మీరున్నా ఆ సమయంలో అదే పని చేసేవారు" వినయంగా అన్నాడు నజీర్.

సకీనా ఆతిథ్యానికి నజీర్ సంతోషభరితుడైతే అయ్యాడు కానీ, ఎక్కడో ఒక మూలన కాస్తంత వెలితి తన స్థానంలో అది కెలుకుతూనేవుంది. నేరుగా, ఏకాంతంగా సకీనాతో మాట్లాడాలనుకున్నాడు. కాని మధ్యలో ఈ ఖాన్‌సాబ్ ఒకడు అడ్డొచ్చాడు.

పొడిపొడిగా నాలుగు మాటలు పరదాలో నుండే మాట్లాడి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు నజీర్. వెళుతూ వెళుతూ ప్రస్తుత ఫెయిల్యూర్‌ను సమీక్షించుకుంటూ, పకడ్బందీ ప్రణాళికను ఊహించుకోసాగాడు.

అతడు వెళ్లిపోయిన తర్వాత ఖాన్‌సాబ్, "అతడితో చాలా జాగ్రత్తగా ఉండాలనీ, ఈనాటి నుండే రాకపోకల మార్గాలు మూసేయాలని, అతడేమైనా కానుకలు పంపిస్తే స్వీకరించరాదని, అలాగే బట్టలు పంపినా తిప్పి పంపేయాలని హెచ్చరించాడు.

సకీనా ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఒకవేళ అతడు గనక వస్తే బయటి నుండే తిప్పి పంపేయాలని చాలా గట్టిగా చెప్పారు. అతడి మనస్తత్వాన్ని ఈ రోజు తాను చక్కగా అంచనా వేశానని, అతడి దృష్టి చాలా చెడ్డదని, చాలా జాగ్రత్తగా ఉండాలని మరోసారి హెచ్చరించారు.

"సకీనా! వింటున్నావా? మీ అన్నయ్య మాటలు."

సకీనా మ్రాన్పడిపోయింది. కళ్లవెంట నీళ్లు చిప్పిల్లుతుండగా-"ఏమిటో నా తలరాత- 'ఈయన' వెళ్లిపోయి నాకిన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు. అదే ఆయనగనక ఉండి వుంటే కనీసం నా గురించి ఊహించడానికైనా ఎవరికైనా గుండెలుండేవా?" అంటూ బాధపడసాగింది.

ఖాన్‌సాబ్ ఆమెను ఓదారుస్తూ, జీవితంలోని మెట్టపల్లాలను వివరిస్తూ కాసేపుండి వెళ్లిపోయారు.

సమీనా వంటపాత్రలు శుభ్రం చేయడంలో, ఇల్లు సర్దడంలో ఆమెకు సహకరించి కాసేపటి తర్వాత ఆమె కూడా వెళ్లిపోయింది.

సకీనాకు ఆ రోజంతా చాలా భారంగా గడిచింది. రాత్రి పడుకున్నా కూడా ఏవేవో ఆలోచనలు ఆమెను ఆందోళనకు గురిచేస్తూనే ఉన్నాయి. ఎంతకూ నిద్ర రావడం లేదు. దీనికి తోడు భయం ఆమెను వెంటాడుతోంది.

"ఒకవేళ ఈ రాత్రివేళ నజీర్ గనక వస్తే...?"

ఈ ఆలోచనకే ఆమెకు ముచ్చెమటలు పట్టాయి. భయ భయంగా వాకిలి వైపు చూసింది. చీకటి చీకటిగా ఉంది. కళ్లు మూసుకోవడానికి ప్రయత్నించింది.

కాని ఎంతకూ కళ్లు మూతలు పడడం లేదు. మళ్లీ వాకిలి వైపు తొంగిచూసింది. చీకట్లో అక్కడేదో ఆకారం కదిలినట్లనిపించింది. సకీనా భయంతో దిగ్గున లేచి కూర్చోని మున్నీ వైపు చూసింది. పాప ప్రశాంతంగా నిద్రపోతోంది.

వెంటనే సకీనాకు తన కల గుర్తొచ్చింది. దైవదూతలు తన వైపే వస్తున్న ఆ కలను గుర్తుచేసుకుంటూ మళ్లీ వాకిలి వైపు తొంగి చూసింది. కాని ఇది దైవదూత ఆకారం కాదు. నిండా నల్లని ముసుగులో దయ్యంలా వస్తున్న ఆకారం కిటికీ సువ్వను పంచేసింది.

సకీనా రెప్పవేయడం కూడా మరచిపోయి అచేతనంగా అలానే చూస్తూ ఉండిపోయింది. కనీసం కేక వేద్దామన్నా ఆమె గొంతు పెగల్లేదు. సమీపిస్తున్న ఆకారాన్ని చూసి అతికష్టం మీద "ఎ... ఎవరూ?" అనగలిగింది. అంటూనే అతడి బారి నుండి ఎలా తప్పించుకోవాలా అని తీవ్రంగా ఆలోచించసాగింది.

ముసుగు ఆకారం సకీనాను సమీపించి తన ముసుగు తొలగించింది.

"నజీర్ భాయ్- నువ్వా?" భయం- ఆశ్చర్యం.

"అవును సకీనా, నేనే..." ప్రశాంత సమాధానం.

"ఇంత రాత్రివేళా..."?

"అవును, చెల్లాయి ఒక్కతే ఉంటుంది గదా! కాస్త కబుర్లు చెబుదామని వచ్చాను."

"కాని, ఇంత రాత్రి వేళ రావడం మంచిది కాదు. దయచేసి మీరు వెళ్లండి."

"నేను వెళ్లడానికి రాలేదు సకీనా."

"మరి..?"

"నిన్ను తీసుకువెళ్లడానికి వచ్చాను."

"ఇది మీలాంటి వారి పనికాదు."

"నువ్వేమైనా అనుకో."

సకీనా ఎలాగోలా తప్పించుకుందామని గబాలున తలుపు గొళ్లెం తీసింది. కాని నజీర్ వెంటనే తలుపుకడ్డంగా నిలుచున్నాడు. ఈ శబ్దానికి మున్నీ మేల్కొని ఏడుపులంకించుకుంది.

సకీనా నోరెత్తకుండా ఆమె నోటిని మూసివేశాడు నజీర్. దీంతో ఖాన్ సాబ్‌ను పిలుద్దామనుకున్న అవకాశం కూడా పోయింది. ఒక వైపు మున్నీ ఏడుపు తీవ్రరూపం దాలుస్తోంది. సకీనా గుండె తరుక్కుపోతోంది.

సకీనాను బలవంతంగా లొంగదీసుకోడానికి విఫలయత్నాలు చేస్తున్నాడు నజీర్. కాని సకీనా తీవ్రంగా ప్రతిఘటిస్తోంది.

పాప ఏడుపుకు పక్కింటి సమీనా లేచి- "ఏయ్ సకీనా! ఏమిటా మొద్దు నిద్ర. పాప ఏడుస్తున్నా వినబడడం లేదా?" అంటూ లైటు తీసుకొని బయలుదేరింది.

ఊహించని ఈ పరిణామానికి నజీర్ ఏం చేయాలో అర్థంకాక సకీనాను వదిలేసి పారిపోయాడు.

భార్య అరుపులకు దిగ్గున లేచిన ఖాన్‌సాబ్ పరుగుపరుగున ఉరికొచ్చారు. సకీనా భయంకరంగా రొప్పుతూ రోదిస్తోంది. సమీనా సకీనాను చిన్నగా పైకిలేపి, మంచంపై పడుకోబెట్టి మంచినీళ్లు తాగించింది. చాలా సేపటిగ్గాని తేరుకోలేకపోయింది సకీనా.

ఖాన్‌సాబ్ భయపడ్డంత పనీ జరిగింది. నజీర్ నీడలా వెంబడిస్తు న్నాడని అర్థమైంది. ఇక నుండి సకీనాను ఒంటరిగా ఉండనివ్వవద్దని, అర్ధరాత్రి వరకు సమీనా, సకీనాలు కలిసి ఉండాలని, తరువాత సమీనా పడుకుంటే ఖాన్‌సాబ్ మెలకువతో ఉండాలనీ అనుకున్నారు.

ఈ సంఘటన నజీర్‌పై ఎలాంటి ప్రభావాన్నీ చూపలేదు. గూండాలకు సిగ్గూ-శరం, చీమూ-రక్తం ఉంటే కదా అసలు ప్రభావం చూపడానికి. పైగా ఆవేశంతో మరికాస్త రగిలి పోయాడు. దీనంతటికీ కారణం ఆ ఖాన్‌సాబ్ అని తీర్మానించుకున్నాడు. 'అతడు అడ్డు తొలిగితే..?'

తరువాత ఏం జరిగింది?

★ ★ ★

దాదాపు అర్ధరాత్రి సమయం పదకొండు గంటలు దాటింది. సమీనా, సకీనాలిద్దరి మధ్య సంభాషణ ఇలా సాగుతోంది.

"సమీనా! నీ అనుమానమే నిజమైంది."

"అందులో అసలు అనుమానమే లేదు."

"ఖాన్‌సాబ్ ఉంటే తన ఆటలు సాగవు అనుకున్నాడా దుర్మార్గుడు. అంతే! ఆయన ప్రాణాల మీదికొచ్చింది."

"ఓ అల్లాహ్! ఇక ఇప్పుడు మనమిద్దరమూ నీడలేని వాళ్లమయ్యాం కదా."

"సకీనా! అలా భయపడకు. ఆ దుర్మార్గుడి చెరనుండి ఖాన్‌సాబ్ త్వరలోనే విడుదలవుతారు. నయీంకూడా తప్పు తెలుసుకొని వచ్చేస్తాడు. దైవం మనకు తోడుగా ఉన్నాడు. ఆయన నీడ మన తలపై ఉంది."

"తలపైనా...?"

"అవును అల్లాహ్ తోడు. ఆయన నీడ, ఆయన సహాయం."

అల్లాహ్ పేరు వింటూనే సకీనా భృకుటి ముడిపడింది. ఒక్కక్షణం మౌనంగా కళ్లు మూసుకుంది. తరువాత- "నేను నీకు ఒక విషయం చెప్పలేదు. ఎందుకో ఈ రోజు చెప్పాలనిపిస్తోంది" అన్నది సకీనా.

"అయితే, నాకు చెప్పకుండా దాచిన విషయాలు కూడా ఉన్నాయా?"

"అవును, చెబితే 'అంతా నీ భ్రమ' అని కొట్టిపారేస్తావనే భయంతో చెప్పలేదు."

"ఏమిటో చెప్పు. అది కూడా విందాం" అన్నది సమీనా.

"మున్నీ పుట్టిన రోజు నేనొక కలగన్నాను. ఆ రోజు కొందరు దైవదూతలు మా ఇంటికొచ్చారు... అదిగో చూడు ముసిముసిగా నవ్వుతున్నావు- అందుకే నీకు చెప్పాలంటే భయమేసింది."

"లేదు- లేదు.. చెప్పు.. చెప్పు."

"ఆ దైవదూతలు నా బిడ్డను తమ రెక్కల్లోకి తీసుకున్నారు. నాకు శుభాకాంక్షలు తెలిపారు. పాప కోసం ప్రార్థించారు. అంతలో నా కళ్ల తెరుచుకున్నాయి."

"మీ ఆయన గురించి ఏమీ చెప్పలేదా?"

"ఆయన మనసులో షైతాన్ గూడుకట్టుకున్నదని చెప్పారు."

"ఓ..హో..హో..."

'సమీనా! ఈ కల విషయంలో నీ అభిప్రాయమేమిటి?"

"చాలా శుభప్రదమైన కల."

"పాప కారణంగా, దూతల ప్రార్థనలోని ఓ శుభం కళ్లముందు ప్రత్యక్షంగా కనబడింది."

"ఎలా? ఏ విధంగా?"

"ఆ దుర్మార్గుడు ఇంట్లో దూరి బలవంతాను నా నోరు మూసిన రోజు పాప ఎలాంటి ఏడుపులంకించుకుంది? ఇల్లు లేచిపోయేలా ఏడ్చిన ఆ ఏడుపుకేగా మీరిద్దరూ లేచి వచ్చింది. బహుశా దైవదూతలే పాపను అలా ఏడిపించి ఉంటారు."

"దైవమే మనల్ని కాపాడేవాడు. రా... ఆయన్నే ప్రార్థిద్దాం."

అలా వారిద్దరూ చాలాసేపు దైవం ముందు మోకరిల్లి కడుదీనంగా తమను కాపాడమని వేడుకున్నారు.

తరువాత పరస్పరం సంప్రదించుకొని ఒక నిర్ణయానికి వచ్చారు.

మునుపటికంటే ఇప్పుడు మనకు ప్రమాదం ఎక్కువ. అందుకని మనం వేరువేరుగా చెరో ఇంట్లో ఉండే బదులు ఒకే ఇంట్లో కలిసుందాం. కలిసుంటే ఒక మేధకు బదులు రెండు మేధలు పనిచేస్తాయి.

ఒక నాలుకకు బదులు రెండు నాలుకలు దైవ సహాయం కోసం ప్రార్థిస్తాయి. రెండు చేతులకు బదులు నాలుగు చేతుల్లో బలం ఎక్కువగా ఉంటుంది. మీ ఇంటికంటే మా ఇల్లు కాస్త పటిష్ఠంగా ఉంది. రెండు వైపులా కిటికీలున్నాయి. తలుపులు, కిటికీలు చాలా పకడ్బందీగా ఉన్నాయి. బహుశా తెల్లవారేసరికల్లా ఖాన్‌సాబ్ కనబడడం లేదని వీధివాళ్లకు తెలిసిపోతుందనుకుంటా" అన్నది సమీనా.

సకీనాకు అకస్మాత్తుగా గుర్తొచ్చి, "ఆ రోజు అన్నయ్య పోలీస్ కంప్లయింట్ ఇచ్చారా?" అని అడిగింది తన భర్త వెళ్లిన సందర్భం గుర్తొచ్చి.

"లేదు. నేను చెప్పాను కూడా. కాని ఆయన పట్టించుకోలేదు."

"అవ్వాళ కంప్లయింట్ చేసి ఉన్నట్లయితే ఈ రోజు పనికొచ్చేదేమో."

"నువ్వు కూడా భలే అమాయకురాలివి. ఈ గూండాల రాజకీయాల ముందు ఈ కంప్లెయింట్లు ఏం పనిచేస్తాయి. అంతా డబ్బు రాజకీయం. డబ్బుతో ఏమైనా చేస్తారు. మన మాట ఎవరువింటారు."

"మరి మనం ఏం చేద్దాం?"

"మనం చేసేదేమీ లేదు. ఏది చేసినా నీ వద్దకు దైవదూతల్ని పంపినవాడే చెయ్యాలి."

"మరయితే నా కల నిజమేనంటావా? నిజంగా నిజమేనంటావా?" రెట్టించింది సకీనా.

"నేనయితే నిజమనే అనుకుంటున్నాను."

"అది నేనూ అనుకుంటున్నాను."

ఇలా మాట్లాడుతూ మాట్లాడుతూ ఇంట్లోని సామాన్లు సర్దారు. కొన్ని సామాన్లు సమీనా ఇంటికి చేర్చి, మరికొన్ని సకీనా ఇంట్లోనే ఉంచాలని నిర్ణయించారు. ఇలా ఈ పని పూర్తయ్యేసరికి ఫజర్ నమాజ్ కోసం అజాన్ వినబడింది. ఫజర్ నమాజ్ సకీనా ఇంట్లో చేసి, అల్పాహారం సమీనా ఇంట్లో చేసుకున్నారు. టిఫిన్ చేసి సకీనా పాపకు పాలుపట్టేసరికి నిద్ర ముంచుకొస్తోంది. ఇద్దరూ అలా చెరో మంచంపై అడ్డంపడ్డారు. ఎంతసేపు పడుకున్నారో వారికే తెలియదు. సమీనా పక్కింటామె గావుకేకలు పెట్టి, తలుపులు దబదబా బాది లేపేంత వరకూ వారికి మెలకువ రాలేదు.

"ఏమిటా నిద్ర, ఇంట్లో దొంగలు పడ్డా లేచేలా లేరు. ఎప్పటి నుండి అరుస్తున్నాన్నేను. సరేగాని, బజారుకెళ్తే మాకో కేజీ కాకరకాయలు తెచ్చిపెట్టమని చెప్పు ఖాన్ గారితో. ఇంట్లో ఎవరూ లేరు" అన్నది సమీనా పొరుగామె.

"కాస్త నా మాట కూడా విను. చూడు ఇక్కడెవరున్నారో?"

"ఇంకెవరుంటారు? ఖాన్ భాయ్ ఉంటారు. అని సకీనాను చూసి, అరే.. నువ్వెప్పుడొచ్చావిక్కడికి" అంటూ ఆశ్చర్యపోయింది.

"ఈ రోజే వచ్చాను."

"ఇక్కడే ఉంటావా?"

"అవును."

"మరి ఖాన్‌గారు ఎటెళ్లారు?"

"ఆ దైవానికే తెలుసు" సమాధానంగా అన్నది సమీనా.

"అంటే..?"

"ఆయన రాత్రి నుండీ కనబడడం లేదు."

"కనబడడం లేదా? ఆయనలా ఎప్పుడూ చేయలేదే..."

"ఇదంతా ఆ నజీర్‌గాడి పనే."

"ఆఁ హా..ఇప్పుడర్థమయింది. అసలు విషయం. నేను నీకు ముందే చెప్పాను. ఇతరుల భారం నెత్తిన పెట్టుకోవద్దని. అయితే అనుకున్నంతా జరిగిందన్నమాట. (సకీనా అక్కడుండటం గమనించి) అంటే, నా ఉద్దేశం ఎవరికీ సాయం చెయ్యొద్దనికాదు గాని, వెనుకాముందూ ఆలోచించా ల్సింది."

"నా చెవులకు ఒక పిలుపు తాకింది. ఇప్పటికీ నా చెవుల్లో అదే ప్రతిధ్వనిస్తోంది" అన్నది సమీనా.

"ఏమిటో అది..?" సమీనా పొరుగామె ప్రశ్నించింది.

"భూవాసులపై ప్రేమ చూపని వారిని పైవాడు కూడా కనికరించడు."

"మరయితే అనుభవించు - ఇప్పుడు నజీర్ మీ ఇద్దరినీ వదలడు."

"పైవాడు చూస్తున్నాడు. అలా మాట్లాడకు."

"మీ నమ్మకమే మిమ్మల్ని కాపాడుతుంది" అంటూ ఆమె ఇంటికెళ్లిపోయింది. ఇంటికెళ్లి గోలగోల చేసింది.

"ఏమండీ... వింటున్నారా! చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలుసా మీకేమన్నా... మీసాలు తిప్పుకుంటూ కూర్చోవడం కాదు. ఇవ్వాళ వాళ్లకు జరిగింది, రేపు మనకు జరగదనేంటి?"

"ఎంత అరచినా ఏం లాభం. మనిషికైతే ఎవరైనా చెబుతారు. రాయికెవరు చెబుతారు."

"ఏమిటీ... ఏమిటే ఆ గోల! ఏమన్నా కొంపలంటుకు పొయ్యాయా? ప్రళయం ముంచుకొచ్చిందా?"

"మీలో మానవత్వం ఉంటే ఇలా ఏమీ తెలియకుండా ఎలా ఉంటారు?"

"అయితే నేను దయ్యాన్ననా నీ ఉద్దేశం?"

"సరే, మీరేదైతే నాకేంగాని, నిన్నటి నుండి ఖాన్‌సాబ్ కనిపించడం లేదట. ఇదంతా ఆ నజీర్‌గాడి పనే. వీధి వాళ్లంతా దద్దమ్మలు. పేరుకే పఠాన్‌ల కాలనీ. ఎవరికీ పౌరుషం లేదు."

"చాలు, చాలు, ఇక ఆపు. మరీ ఎక్కువైపోతోంది."

"ఏమిటండీ ఆపేది..?"

"అసలు మీకు స్త్రీల పరువు ప్రతిష్ఠల గురించి ఏమైనా తెలుసా? ఇంట్లో అయితే చూపిస్తారు ప్రతాపం."

"అసలింతకూ నువ్వనేదేమిటి? నువ్వేం చెప్పదలచుకున్నావు? నన్నేం చేయమంటావు. చెడామడా అరిస్తే ఏమిటి ప్రయోజనం?"

"ఏమీ చెయ్యొద్దుగాని, వెళ్లి కనీసం రిపోర్టయినా ఇవ్వండి."

"రిపోర్టిస్తే ఏమౌద్దంటావు?"

"మరేం చేస్తారు?"

"రిపోర్టిస్తే వాడికేమవుద్ది. నాలుగు డబ్బులు మేపితే పోలీసులు కిక్కురుమనరు. పైగా రాజకీయాలు."

"అయితే మరి ఏం చేస్తానంటారు?"

"ఇలాంటి వాడికి బాదుడే మందు."

"బాదుడా!"

"అవును, బాదుడే- లే... దారిలో అడ్డంలే" వాడి డొక్క చీరేస్తాను. ఈ ముసలాడి తడాఖా ఏమిటో చూపిస్తాను."

"అయ్యయ్యో! కాస్త ఆగండి..."

"లే... దారిలో అడ్డం- ఇప్పటిదాకా పౌరుషాన్ని రెచ్చగొట్టి ఇప్పుడు ఆపుతున్నావా?"

"ఆఁ, అది కాదండీ...?"

"ఏది కాదు? నేనా దొంగ నాయాలు.."

ఆగ్రహంతో బయలుదేరిన భర్తను గట్టిగా పట్టుకొని కేకలు వేయసాగింది. సమీనా పొరుగింటి మదార్‌బి కేకలకు ఇరుగుపొరుగంతా

పోగయ్యారు. ముసలాయనకు అసలే ముక్కు మీద కోపం, అందరూ నచ్చజెప్పారు." బాబా శాంతించమని, ఇల్లాలిపై కరుణించమని." తరువాత అసలు విషయమేమిటని ఆరా తీశారు.

"బాబా! అసలు విషయమేమిటి?"

"చెబుతా వినండి, మొట్టమొదట సకీనా పరువు ప్రతిష్టలపై దాడి జరిగింది. ఖాన్‌సాబ్ అడ్డొస్తున్నాడని అతన్ని మాయం చేశారు. ఇదంతా ఆ బద్మాష్ నజీర్‌గాడి పని కాకపోతే మరెవరి పని? వాణ్ణి లేపేస్తే, స్త్రీలంతా కాస్తంత సుఖంగా బ్రతుకుతారు.

వెళితే నేను జైలుకు వెళతా, ఎక్కితే ఉరి కంబం ఎక్కుతా, ఎలాగూ వయసు మీద పడింది. కాటికి కాళ్లు చాపే ఉన్నాను. నజీర్‌గాణ్ణి ఏసేస్తే వాడి దౌర్జన్యాల నుండి చాలా మంది విముక్తి పొందుతారు" ఆవేశంతో రగిలిపోయాడు ముసలాడైన ముంతాజ్‌ఖాన్.

అతడి ఆవేశాన్ని చల్లబరచడానికి వారికి చాలా సేపు పట్టింది. ఎన్నో ప్రయత్నాలు చేసిన మీదటగాని ముంతాజ్‌ఖాన్ కాస్త చల్లబడ్డాడు.

* * *

ముసలాయన ఆవేశం చూసి యువకులు సిగ్గుపడ్డారు. వాళ్లకూ రోషం తన్నుకొచ్చింది. యువకులంతా సమావేశమై చర్చించుకోసాగారు. కాని పెద్దవాళ్లు, వాళ్లను అనునయించారు.

"చూడండి! ఆవేశంతో పనులు జరగవు. నజీర్ పెద్ద జిత్తులమారి. సహనంతో, సంయమనంతో ప్రణాళికాబద్ధంగా అతన్ని డీల్ చేయాలి. ముఖ్యంగా అతడికి పోలీసుల అండ ఉంది. కాబట్టి ఆవేశం కంటే ముందు వివేకం కావాలి. దాంతోనే వాణ్ణి ఎదుర్కోవాలి" అంటూ నచ్చజెప్పారు.

ఇదంతా అయిన తరువాత ముసలాయన సమీనానుద్దేశించి, "చూడమ్మాయ్! ఈ రోజు నుండి ఇవతల కిటికీ తెరిచే ఉంచు. నేనిక్కడే మంచం వేసుకుంటాను. ఎవడొస్తాడో నేనూ చూస్తాను. ఏమనుకుంటున్నాడో మేమంటే..?" అంటూ ముసలాయన ఓ మంచి దుడ్డు కర్ర పక్కన బెట్టుకొని కిటికీ దగ్గర మంచం వేసేశాడు. ముంతాజ్‌ఖాన్ వయసును బట్టి అందరూ ఆయన్ని బాబా బాబా అని పిలిచేవారు. అందుకని ఆ కాలనీ మహిళలకు ఆయన వద్ద పరదా అవసరమే ఉండేది కాదు. తరువాత ముంతాజ్‌ఖాన్ సకీనానుద్దేశించి. "చూడమ్మాయ్ సకీనా! నా మనవళ్లంతా ఎక్కడో ఉన్నారు. నాకసలు పొద్దేపోవట్లేదు. పాపను తీసుకొచ్చి నా ఒళ్లో పడేయకూడదు?"

సకీనా, సమీనాలు ఒకరి ముఖాలొకరు చూసుకొని ముసిముసిగా నవ్వుకొని, మున్నీని తీసుకెళ్లి ఆయన ఒళ్లో పెట్టారు. "ఆహా...! 'స్వర్గపూవు' అంటూ ముంతాజ్‌ఖాన్ పాప తలనిమిరి ముద్దాడుతూ, 'ఒక్కరేచాలు, ఇద్దరే చాలు అనే వాళ్లకసలు బుద్ధే లేదు. అందరూ అలా అనుకుంటూ పోతే 'ఈ మొగ్గలు వికసించేదెలా?' ముసలి బాబా మాటలు ఎవరూ పట్టించుకోలేదు. అదీగాక అది సందర్భం కూడా కాదు గదా!

★ ★ ★

చీకటి. చిమ్మచీకటి, చీకటి కొట్టం. ఏమీ కనిపించడం లేదు. ఏమీ అర్థం కావడం లేదు. అప్పుడే కళ్లు తెరుచుకున్నాయి. ఇది ఏ ప్రదేశమో, ఇక్కడ తానెందుకున్నాడో, ఖాన్‌సాబ్‌కు ఏమీ అర్థం కావడం లేదు.

ఇక్కడ తనతోపాటు మరెవరో ఉన్నారని మాత్రం అర్థమవుతోంది. అతన్ని చూడాలి, అతనెవరో తెలుసుకోవాలి. తానిక్కడెందుకున్నాడో, ఎవరు తీసుకొచ్చారో తెలుసుకోవాలి. కాని ఎలా? కాసేపు చీకటికి అలవాటుపడిన తర్వాత లీలగా మనిషి ఆకారం కనిపిస్తోంది.

మోకాళ్ల మధ్యలో తలపెట్టుకొని కూర్చొని ఉన్నాడు. కాని ఎలా? తన కాళ్లూ చేతులూ బంధించబడి ఉన్నాయి. ఖాన్‌సాబ్‌కు ఒక్కొక్క విషయం గుర్తుకొస్తోంది.

స్వాగత్ హోటల్‌లో ఎవరితోనో మాట్లాడుతూ టీ తాగుతున్నాడు. టీ తాగిన తర్వాత ఏదో మైకంలా అనిపించింది. అల్ కౌసర్ మసీదులో కాసేపు విశ్రాంతి తీసుకుందామని లేచారు అంతే! తరువాత ఏం జరిగిందో గుర్తు లేదు. తరువాత ఇదిగో ఇప్పుడు, ఇలా, ఇక్కడ. ఆయన ఆలోచనల్లో పడిపొయ్యాడు. సకీనా, సమీనాల పరిస్థితి ఎలా ఉందో? ఇది ఖచ్చితంగా ఆ నజీర్‌గాడి పన్నాగమే అని ఆయనకు అర్థమైంది.

టీలో ఏదో కలిపి తననీ చీకటి కొట్టంలో పడేశాడు. ఆయన దృష్టి అక్కడ కూర్చున్న వ్యక్తిపై పడింది. నల్లని ఆకారం లీలగా మాత్రమే కనిపిస్తోంది. సరే ఏమైతే అదే అవుతుందని భావించి "ఎవరు నువ్వు?' అంటూ ప్రశ్నించారు.

మోకాళ్ల మధ్య నుండి తలపైకి లేచినట్లు అనిపించింది. హీన స్వరం వినిపించింది. 'మీరెవరు?' అని.

"నా పేరు అంజద్‌ఖాన్. ఇక్కడే యాష్ కాలనీలో ఉంటాను."

"అరే.. అంజద్ ఖాన్‌గారా! యాష్ కాలనీ పఠాన్ల వీధి...?"

"ఆఁ...అవునవును... పఠాన్ కాలనీ అంజద్ ఖాన్ తెలుసా నీకు"

"అవును. ఒకప్పుడు బాగా తెలుసు. ప్రస్తుతం మరచిపోయాను. నన్ను కూడా అందరూ మరచిపోయారు..."

అతను ఏడుస్తున్నాడని అర్థమైంది అంజద్‌ఖాన్‌కు.

'సరే... నువ్వెందుకు బాధ పడుతున్నావు? నీ పేరేమిటో చెప్పు, బహుశా నేను కూడా నిన్ను గుర్తించగలనేమో...!"

"ఖాన్ సాబ్! ఖాన్ సాబ్... నేను, నేను మీ పొరుగింటి నయీమ్‌ను."

"అరే... నయీమ్ నువ్వా? నువ్విక్కడెలా ఉన్నావు?"

"ఏం చెప్పను ఖాన్ సాబ్! నేను ఘోరమైన పాపం చేశాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను. నేను దైవ నిర్ణయాన్ని వ్యతిరేకించాను."

"తప్పు చేశావా? - దైవనిర్ణయాన్ని వ్యతిరేకించావా? ఆ..ఆఁ అర్థమైంది. చెప్పు చెప్పు" ఏం జరిగింది?"

"మా రాచరిక గర్వం మీకు తెలిసిందే కదా! ఆస్తులన్నీ హరించుకు పోయినా నవాబుగిరీకి ఏమీ ఢోకా ఉండకూడదనేది మా విధానం. అందుకే ఆడపిల్ల వద్దనుకున్నా, ఈ కట్నాలు కానుకల బెడద, అల్లుడు ఇంటికొస్తే నామోషీ అనే భావన, ఈ ఆధునిక కాలంలో ఆడపిల్లల ఆలనా పాలనా, పెళ్లిళ్లకు లక్షలకు లక్షలు డబ్బు, ఇవన్నీ విలాసవంతమైన జీవితానికి అడ్డంకులని భావించాను.

అందుకే ఆడ సంతానం వద్దని దైవంతో ఎంతగానో మొరపెట్టుకున్నా. కాని వద్దనుకున్నదే జరిగింది. దీంతో మనస్తాపం చెందా. అహం అడ్డొచ్చింది. ఇంట్లోంచి వెళ్లిపోయాను.

ఊళ్లు పట్టుకొని తిరిగాను. కొన్నాళ్ల తర్వాత నజీర్ కలిశాడు. సకీనా మరో వ్యక్తిని పెళ్లాడి అతడితో వెళ్లిపోయిందని చెప్పాడు."

"సకీనా..? పెళ్లి చేసుకుందా..?"

"అవును, నా శవం ఖమ్మం పక్కన మున్నేరు వాగులో ఎక్కడో దొరికిందని, శవం కుళ్లిపోయి ఉండటంతో పోస్టుమార్టం కూడా చేయలేక పోయారని, కాని తెలిసినవాళ్లు నయీం చనిపోయాడని ధృవీకరించారని చెప్పిన తరువాత, కొన్నాళ్లకు సకీనా మళ్లీ పెళ్లి చేసుకుందట.

సరే... ఇప్పుడైనా ఇంటికెళదామని బయలుదేరాను. కొత్తగూడెంలో కొంతమంది కలిశారు. నాపై జాలి చూపారు. ఊరిబయట ఒక ధాబా హోటల్‌కి తీసుకెళ్లి భోజనం చేయించారు. తరువాత ఏం జరిగిందో ఇక నాకు తెలియదు.

స్పృహ వచ్చేసరికి ఇక్కడున్నాను. ఈ స్థితిలో... నేను నా భార్యపై, నా పసిపాపపై దౌర్జన్యం చేశాను. దాని ఫలితం ఇలా అనుభవిస్తున్నాను. ఇక ఇప్పుడు నాకు బ్రతకాలని లేదు. కాని నేను దైవానికి దూరమైనట్లే చావు కూడా ఇప్పుడు నన్ను దగ్గరికి రానివ్వడం లేదు. కాని నేను చనిపోవాలి. ఈ ప్రపంచం ఇక నన్ను చూడకూడదు... చూడకూడదు..."

నయీమ్ పొగిలిపొగిలి ఏడుస్తున్నాడు.

ఖాన్‌సాబ్ నయీం బాధాతప్త గాధ విని తన బాధను మరచి పొయ్యారు. విషయమంతా పూసగుచ్చినట్లు నయీంకు వివరించి, అతణ్ణి కాస్త ఊరడించారు. సహాయం కోసం దైవాన్ని వేడుకొమ్మని సలహా ఇచ్చారు.

పాప క్షమాపణ కోసం ఆయన్నే వేడుకొమ్మని, ఎట్టి పరిస్థితిలోనూ నిరాశ పడవద్దని, ఆయన ఏది చేసినా మంచికే చేస్తాడని ధైర్యం చెప్పారు. శిక్ష అనుభవించబట్టే గదా నీకు వాస్తవం తెలిసొచ్చింది? నయీం, నువ్వు వినే ఉంటావు. భూవాసులపై కనికరించని వారిని పైవాడు కూడా కరుణించడని."

"అవును, మీరు నిజం చెప్పారు. నా పాపం మామూలు పాపం కాదు. నేనైతే నా భార్య బిడ్డలపైనే కనికరం చూపలేదు. ఇక నన్ను దేవుడు ఏం క్షమిస్తాడు?"

"నయీం! నిరాశపడకు. దైవం అనంత కరుణామయుడు, అపారమైన కృప కలవాడు. దాసుడు తన ముందు సాగిలపడి విలవిల్లాడుతూ ప్రాధేయపడితే ఆయన కరుణ సముద్ర కెరటాల్లా ఉప్పొంగుతుంది. బహుశా నీ శిక్షాకాలం సమాప్తం కానుందేమో! కాని నువ్వసలు ఈ చీకటి కొట్టంలో ఇన్నాళ్లూ ప్రాణాలతో ఎలా ఉన్నావు?"

"అవును, ఈ చీకటి కొట్టానికి ఒకే ఒక ద్వారం ఉంది. అదిగో పైకి చూడండి. ఆ చిన్న రంధ్రం ఆధారంగానే పగలా రాత్రా అనేది తెలుస్తుంది. రోజూ తెల్లవారుతూనే ఓ ముసుగు వ్యక్తి వచ్చి ద్వారం తెరుస్తాడు. కళ్లకు గంతలు కట్టి బంధనాలు విప్పుతాడు. అతడి కనుసన్నలలో చీకట్లోనే కాలకృత్యాలు తీర్చుకోవాలి.

వెంటనే కొట్టంలోకి తోసి అన్నపానీయాలు సమకూరుస్తాడు. మళ్లీ కాళ్లూ చేతులూ బంధించి ద్వారం మూసేసి వెళ్లిపోయాడు. ఇదీ జీవితం...!"

"ఓహో..! దీర్ఘంగా శ్వాసిస్తూ, "నయీం! మరి నువ్విక్కణ్ణించి బయటపడే మార్గం ఏమీ ఆలోచించలేదా?" అని ప్రశ్నించారు.

"ఇలాంటి దీన స్థితిలో ఏమాలోచించగలను. నాకేమీ అర్థం కాలేదు."

"కనీసం దైవాన్నయినా ప్రార్థించాల్సింది. రా, ఇద్దరం కలిసి దైవాన్ని ప్రార్థిద్దాం. తరువాత ఆలోచిద్దాం" అంటూ ఖాన్‌సాబ్ బంధించిన చేతుల్ని

లేచినంత వరకూ ఎత్తి దీనంగా దైవాన్ని ప్రార్థించడం మొదలెట్టారు. నయీం కూడా ఆయన్ని అనుసరిస్తూ 'ఆమీన్' పలకనారంభించాడు.

ప్రార్థన తరువాత, "నయీం! ఇప్పుడు మనమిద్దరం ఒకచోట చేరాం. ఇద్దరమూ ఆలోచన చేద్దాం. ఆలోచన అనగానే నాకో సంఘటన గుర్తొస్తోంది." "ఏమిటది?"

"చెబుతా విను. ఈ కథ దైవప్రవక్త ముహమ్మద్ (స) తన ప్రియ సహచరులకు వినిపించారు" అంటూ మొదలెట్టారు ఖాన్‌సాబ్.

ఒకసారి ముగ్గురు మిత్రులు ప్రయాణంలో ఉన్నారు. ప్రయాణంలో అకస్మాత్తుగా పెద్ద తుఫాను వచ్చింది. వెంటనే ముగ్గురూ ఓ గుహలో దూరారు. తుఫాను తాకిడికి ఓ పెద్ద బండరాయి ఆ గుహ ద్వారానికి అడ్డుపడింది. దీంతో ముగ్గురూ బాగా భయపడిపొయ్యారు. ఏం చేయాలో అర్థం కాలేదు.

అప్పుడు ముగ్గురూ ఒక నిర్ణయానికొచ్చారు. తాము జీవితంలో చేసిన సత్కార్యాలను ఏకరువు పెడుతూ దైవాన్ని సహాయం కోసం అర్థిద్దామని అనుకున్నారు. వారిలో ఒక వ్యక్తి "దేవా! నేను తల్లిదండ్రుల సేవ చేసేవాడిని. వారిని కంటికి రెప్పలా చూసుకునేవాడిని, వారి మనసెప్పుడూ కష్టపెట్టకుండా, సదా వారిని సంతోషపెట్టడానికే ప్రయత్నం చేసేవాడిని, ఇది కేవలం నీ ప్రసన్నత కోసమే చేసేవాడిని. దేవా! నా ఈ సత్కార్యం స్వీకరయోగ్యమైతే ఈ రాయిని తొలగించు" అని ప్రార్థించాడు. దీంతో ఆ రాయి కాస్త తొలగింది. వీరి ఆశలు చిగురించాయి. ప్రార్థన ఫలించినట్లు కళ్లముందు కనిపించింది. అప్పుడు మరో వ్యక్తి :

"దేవా! నేను ఒక అమ్మాయిని అమితంగా ప్రేమించాను. కాని

ఆమె నా ప్రేమను తిరస్కరించింది. నేను చేసిన ఏ ప్రయత్నమూ ఫలించ లేదు. చివరికి ఆమెకు నాతో అవసరం ఏర్పడింది. నేనా అవకాశాన్ని జారవిడవకుండా నా కోరిక తీరిస్తేనే పైకం సమకూరుస్తానని షరతు పెట్టాను. గత్యంతరం లేని దీన పరిస్థితిలో దానికామె ఒప్పుకొని నా దగ్గరికొచ్చింది.

కాని ఎవరైనా చూస్తారోమోనని సందేహం వెలిబుచ్చింది. ఈ చీకటి ఇంట్లో నువ్వూ నేనూ తప్ప ఇంకెవరున్నారని నేను ఎదురు ప్రశ్నించాను.

అప్పుడామె, అవును ఎవరూ లేరు, తలుపులు, కిటికీలన్నీ మూశావు. లైట్లూ ఆర్పేశావు. ఇక ఏ కన్నూ మనల్ని చూడలేదు. కాని ఒక కన్ను మాత్రం మనల్ని గమనిస్తోంది. ఓ శక్తి మనల్ని చూస్తోంది. నువ్వు ఆ శక్తికి భయపడు" అని సర్వాంతర్యామి, సర్వజ్ఞాని అయిన దైవాన్ని గూర్చి భయపెట్టి దుష్టకార్యాన్ని మానుకోమని హెచ్చరించింది.

ఓ దేవా! నేను కేవలం నీ భయంతోనే ఆ అమ్మాయిని వదిలేశాను. పవిత్రంగా, పరిశుద్ధంగా, ఆమెకు కావలసిన పైకం ఇచ్చి పంపించి వేశాను. ఇది కేవలం నీ భయంతోనే, నీ ప్రసన్నత కోసమే చేశాను. దేవా! నా ఈ కార్యం స్వీకారయోగ్యమైతే ఈ రాయిని తొలగించు". అని ప్రార్థించాడు. దీంతో ఆ రాయి మరికాస్త జరిగింది.

మూడో వ్యక్తి తాను చేసిన సమాజ సేవను ప్రస్తావిస్తూ "దేవా! నేను కేవలం నీ ప్రసన్నత కోసమే సమాజ సేవలో పాలుపంచుకున్నాను. నా ఈ పనిని నీవు స్వీకరించినట్లయితే ఈ రాతిని తొలగించు" అని ప్రార్థించాడు. దీంతో ఆ రాయి పూర్తిగా తొలగిపోయింది. ఆ ముగ్గురు మిత్రులూ గుహ నుండి సురక్షితంగా బయటపడ్డారు.

చూడు తమ్ముడూ నయీం! మనం కూడా అలాంటి పరిస్థితుల్లోనే ఉన్నాం. ఒక్క దైవం తప్ప మనల్ని రక్షించేవాడెవడూ లేడు. అందుకని మనం కూడా ఏవైనా సత్కార్యాలు చేసి ఉన్నట్లయితే మనం కూడా అలాగే దైవాన్ని వేడుకుందాం.

కేవలం దైవం కోసమే ఏమైనా చేసి ఉన్నట్లయితే నయీం అల్లాహ్‌ను వేడుకో, ఆయన తప్పకుండా నీకు సహాయం చేస్తాడు."

నయీం ఓ దీర్ఘ శ్వాస విడిచి... 'ఖాన్‌సాబ్...!' అన్నాడు. 'ఖాన్‌సాబ్ కాదు.. దైవాన్ని పిలువు. ఆయనతో చెప్పుకో.

"అవును కదూ..! ఓ పరాత్పరా! ఓ దేవా! నేనొక పనికిమాలిన దాసుణ్ణి. నేనీ ప్రపంచంలో ఎన్నో తప్పులు చేశాను, ఎన్నో పాపాలు చేశాను. కాని, నిస్వార్థంగా, పేరు ప్రఖ్యాతులు ఏమీ ఆశించకుండా ఒక సత్కార్యం మాత్రం చేశాను.

ఒకసారి నేను హైద్రాబాద్ వెళ్లాను. అప్పుడక్కడ మత కలహాలు జరుగుతున్నాయి. ఇరువర్గాలూ ఒకర్నొకరు చంపుకుంటున్నారు. ముస్లింలకు తీవ్ర నష్టం సంభవించింది. అప్పుడు నేను నా మిత్రుని ఇంట్లో ఉన్నాను. కొందరు ముస్లిం యువకులు ముస్లింలకు జరిగిన నష్టంపై తీవ్రంగా ఆగ్రహిస్తూ నేనున్న పక్కింటి హిందూ కుటుంబంపై విరుచుకుపడ్డారు.

అప్పుడా ఇంట్లో ఓ ముప్ఫయ్యేళ్ల వితంతువు తప్ప ఎవరూ లేరు. వారు ఆమెను బలాత్కరించి హత్య చెయ్యాలని పథకం వేశారు. వారామెను చుట్టుముట్టగానే ఆమె చేసిన ఆర్తనాదాలు నన్ను కలచివేశాయి. దేవా! వెంటనే నేను వెళ్లి వాళ్ల బారి నుండి ఆమెను రక్షించాను. నా మిత్రుడు

రహిమాన్నూ, మరికొందరు కుటుంబ సభ్యులు నాకు సహకరించారు. ఓ దేవా! ఈ పని కేవలం నీ ప్రసన్నత కోసమే చేశాను.

నా ఈ సత్కార్యాన్ని నువ్వు స్వీకరించినట్లయితే నన్ను ఈ ఆపద నుండి కాపాడు''' అంటూ నయీం దీనంగా ప్రార్థించి, చీకటి ద్వారం వైపు, తరువాత కప్పుపై రంధ్రం వైపు ఆశగా చూశాడు. కాని, ద్వారమూ తెరుచుకోలేదు, పై రంధ్రమూ విస్తరించలేదు. కాళ్ళ చేతుల బంధనాలూ తెగిపోలేదు. అన్నీ యధాతథంగానే ఉన్నాయి.

నయీంకు నిరాశా నిస్పృహలు ఆవరిస్తుండగా అప్రయత్నంగా "ఖాన్‌సాబ్! దైవం నా సత్కార్యాల్ని స్వీకరించలేదు. ఇక మీరైనా ప్రార్థించండి. దైవం మీ వేడుకోలును తప్పకుండా స్వీకరిస్తాడు. నేను మహాపాపిని, నా మొరను దైవం పట్టించుకోడు. ఇంతటి మహాపాపిని దేవుడు మాత్రం ఏం మన్నిస్తాడు?" అన్నాడు.

అప్పుడు ఖాన్‌సాబ్ చీకట్లోనే తలపైకెత్తి, "ఓ పరాత్పరా! నాకు తెలిసినంత వరకూ ఎంతో కొంత నా స్వలాభం లేకుండా నేను ఏ సత్కార్యమూ చేయలేదేమో! కాని సకీనా విషయంలో మాత్రం, కేవలం నీ కోసమే ఆమెకు నా చేతనైన సాయం చేశానన్న నమ్మకం మాత్రం నాకుంది. దేవా! నీకన్ని విషయాలూ తెలుసు.

అయినా ఈ సత్కార్యాన్ని నీ ముందుంచి నేను మా విడుదల కోసం వేడుకుంటున్నాను. ఓ ప్రభూ! నీ ప్రియ ప్రవక్త నోటి నుండి వెలువడిన కథనం ఏ పరిస్థితుల్లోనూ అసత్యం కాబోదు. ఈ రోజు కూడా ఆ ప్రభావాన్ని మాకు చూపించు."

"ఖాన్ సాబ్! మీ ప్రార్థన కూడా స్వీకరించబడలేదు. చూడండి!

తలుపూ తెరుచుకోలేదు, రంధ్రమూ విస్తరించలేదు. మన బందనాలూ తెగిపోలేదు. ఎక్కడి దక్కడే యథాతథం..."

నయీం నిరాశ, నిస్పృహ, విచారంతో అన్నాడు :

"నయీం! ఎందుకంత నిరాశపడతావు? ఎందుకంతగా ఢీలాపడిపోతావు? దైవకారుణ్యం పట్ల నిరాశ చెందకు. తలుపు తెరుచుకోకపోతే ఏమయింది? నాకైతే హృదయ ద్వారాలు తెరుచుకున్న అనుభూతి కలుగుతోంది. ఆలోచనా శక్తి పెరిగింది. పైద్వారం వెడల్పు కాకపోతే మాత్రం ఏమైంది. గుండె ధైర్యం పెరుగుతన్నట్లనిపిస్తోంది నాకు! కాళ్లూ, చేతుల బంధనాలు తెగిపోకపోతే ఏమయింది? మన ఆత్మలు స్వేచ్ఛగా విహరించడం లేదా?" "నా భావాలకు సంకెళ్లు వేయడం ఎవరి తరం' అన్న నానుడిని గుర్తుకు తెచ్చుకో" అంటూ ధైర్యం నూరిపోశారు ఖాన్‌సాబ్.

"అవును ఖాన్‌సాబ్! నేను బాధల్ని భరించి భరించి విసిగి వేసారిపోయాను. కాని ఇప్పుడు మాత్రం నాలో ఏదో ఒక కొత్త ఉత్సాహం, జీవం పోసుకున్నట్లనిపిస్తోంది. ఎవరో 'అపరిచితుడు' నా శరీరంలోకి ప్రవేశించి 'ఏమిటాభయం? ధైర్యంగా లేచి నిలబడు, ఇక చూడు దైవసహాయం ఎలా లభిస్తుందో" అంటూ ఊరడిస్తున్నట్లు అనిపిస్తోంది, అంటూ "ఉఠ్ బాంద్ కమర్ క్యా డర్‌తాహయ్, ఫిర్ దేఖ్ ఖుదా క్యా కర్తాహయ్" అంటూ ఉర్దూ సాంగ్ హమ్ చేశాడు నయీం.

"మరిక ఆలస్యమెందుకు? దైవం పేరు పలికి ధైర్యం చేయి" అని ప్రోత్సహించారు ఖాన్‌సాబ్.

నయీం ఒక్కసారి ఒళ్లువిరిచి, తన శక్తినంతా ఉపయోగించాడు. కాని సంకెళ్లు మాత్రం తెంచలేకపొయ్యాడు. ఈ దృశ్యం మసకమసగ్గా చూస్తున్న ఖాన్‌సాబ్ ముసిముసిగా నవ్వారు. నయీంకు కూడా తన చర్య పట్ల తనకే చిరు ఆనందం కలిగింది. చాలా కాలం తర్వాత ఈ రోజు మనసు చాలా ఉల్లాసంగా ఉంది అన్నాడు నయీం.

"అవునా? నాకైతే మన ప్రార్థనలు స్వీకరించబడుతున్నట్లే అనిపిస్తోంది. నా మనసులో ఓ ఆలోచన సుడులు తిరుగుతోంది. ఓ పథకం రూపుదిద్దుకుంటోంది. చూడాలి రేపు ఉదయం ఏం జరుగుద్దో..."

"ఏమిటది?" ఆసక్తిగా ప్రశ్నించాడు నయీం.

"సభలో వింటేనే కవితకు అందం. ఒంటరిగా వినిపించడం నాకు ఇష్టం ఉండదు. చూడు రేపు ఏం జరుగుతుందో..?" అంటూ ఖాన్‌సాబ్ చాలా కబుర్లు చెప్పారు. ఖాన్‌సాబ్ సహచర్యంలో నయీం బాధలన్నీ మరచిపొయ్యాడు. అసలు ఒంటరితనమే ఒక శిక్ష. ఇప్పుడు ఒకరికి ఇద్దరయ్యారు. కాబట్టి కాస్త ఊరట పొందారు.

రెండో రోజు తెలతెలవారుతుండగా తలుపు తెరుచుకుంది. ముందుగా నయీం కళ్లకు గంతలు కట్టి, తరువాత ఖాన్‌సాబ్ వద్దకు వచ్చాడా వ్యక్తి. ఖాన్‌సాబ్ అతడు రాగానే 'అస్సలాము అలైకుం అంటూ సలాం చేశారు. కాని ఆ వ్యక్తి ఓసారి ఎగాదిగా చూసి తన పని పూర్తి చేశాడు. తరువాత ఇద్దరి సంకెళ్లూ విప్పి బయటికి తీసుకు వెళ్లాడు. ఇద్దరూ కిక్కురు మనకుండా అతడి ఆజ్ఞను పాలించారు. అతడే అన్నీ తానై వారి

అవసరాలు తీర్చాడు. తరువాత మళ్లీ లోనికి తీసుకెళ్లి భోజనం అందించాడు.

ఖాన్‌సాబ్ భోజనం చేస్తూ చేస్తూనే ముసిముసిగా నవ్వుతూ, "సోదరా! ఈ రోజు మీ ఆప్యాయత చూసి మా తల్లిదండ్రులు గుర్తొచ్చారు. మా పసితనంలో, మాకు తప్పటడుగులు కూడా వేయడం రానప్పుడు మా తల్లిదండ్రులు మా చేయిపట్టి తీసుకెళ్లి మలమూత్ర విసర్జన చేయించేవారు. కడిగేవారు, ఎత్తిపోసేవారు, ముఖం కడిగించేవారు, అన్నపానీయాలు తినిపించేవారు, తాపించేవారు.

ఈ రోజు మీరు కూడా అవన్నీ చేసి మా తల్లిదండ్రుల్ని మరిపించారు. అప్పుడు మాత్రం మేము మా తల్లిదండ్రుల వద్ద గారాలు పోయేవాళ్లం. ఈ రోజు అదిలేదు. అదొక్కటే తేడా. దైవం మీకు మంచి ప్రతిఫలం ప్రసాదించాలని కోరుకుంటున్నాను."

ఖాన్‌సాబ్ అతణ్ణి ఇలా పొగుడుతూ భోజనం చేశారు. కాని అతడు మాత్రం ఏమీ మాట్లాడలేదు. ఇలా వీరి భోజనాలు పూర్తయిన తర్వాత అతడు యథాప్రకారం తన పని పూర్తి చేసి తాళం వేసి వెళ్లిపోయాడు.

'అల్‌హందులిల్లాహ్ దైవానికి కృతజ్ఞతలు' అన్నారు ఖాన్‌సాబ్. నయీం మాత్రం చాలా అసహనంగా ఇలా అన్నాడు.

"ఖాన్‌సాబ్! మీరతణ్ణి అంతగా పొగిడినా ఆ దుర్మార్గుడు ఒక్కమాట కూడా మాట్లాడకుండా నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోయాడు. ఫలితమేమీ కనిపించలేదు."

"నయీం! ప్రయత్నమే మన పని, ఫలితం దైవాధీనం. సలాం వల్ల ప్రేమ పెరుగుతుందని నేను పుస్తకాల్లో చదివాను. ఎవరినైనా ప్రశంసించడం వల్ల, అతడి గురించి ప్రార్థించడం వల్ల వారి హృదయాలు మెత్తబడతాయి. ఈ విషయాలు హదీసుల వల్ల రూఢీ అవుతున్నాయి.

మన ప్రియప్రవక్త పలికిన ప్రతి పలుకూ అక్షర సత్యం. నాకా నమ్మకముంది. సత్యమనేది తప్పకుండా తన ప్రభావాన్ని చూపిస్తుంది."

"అరే... ఖాన్‌సాబ్! ఏం ప్రభావమో ఏమో! అన్ని అంతగా ప్రార్థనలు చేశామా? ఏం జరిగింది? ఫలితం శూన్యం. ఈనాటి అపజయమైతే మన కళ్లముందే ఉంది."

"చూడు, నయీం! ఇక నీ విడుదలకు సమయం అతి సమీపంలోనే ఉన్నదని నా మనసు సాక్ష్యం పలుకుతోంది. సలాము, ప్రార్థన, సౌమ్యతతో కూడిన పలుకులు రాతిలాంటి గుండెల్ని కూడా కరిగిస్తాయి. అతి స్వల్పమైన 'పూలరెమ్మ'తో వజ్రాన్ని సైతం కోయవచ్చన్నాడు ఒకాయన. పూల రెమ్మంటే ఇలాంటి సౌమ్యపలుకులే కదా! వజ్రాన్ని సైతం కోయవచ్చంటే, ఇలాంటి రాతిగుండెలనే కదా అర్థం. మొత్తానికి దైవ కారుణ్యం పట్ల మాత్రం నిరాశ చెందకూడదు. సరే చూద్దాం, రేపేమవుతుందో!"

నయీం, ఖాన్‌సాబ్ మాటలైతే విన్నాడుగాని, అతనికి ఏమాత్రం తృప్తి కలగలేదు. పిచ్చాపాటి మాట్లాడుతూ తన భార్యాబిడ్డల విషయం ప్రస్తావించాడు. ఖాన్‌సాబ్ అతణ్ణి మళ్లీ ఊరడించి, దైవకారుణ్యం పట్ల ఎట్టి పరిస్థితిలోనూ నిరాశ చెందరాదని, అయన్ని ప్రార్థిస్తూ ఉండమని

హితవు చెప్పారు. దీంతో నయీం రేపటి నిరీక్షణలో పడిపొయ్యాడు.

రెండో రోజూ మళ్లీ ఆ వ్యక్తి వచ్చాడు. ఖాన్‌సాబ్ మళ్లీ అతడికి సలాము చేశారు. ఈ రోజు పేరు కూడా అడిగారు. అతడు మళ్లీ యధాప్రకారం ఏమీ మాట్లాడకుండా, తన పని పూర్తి చేసుకుని వెళ్లి పోయాడు. మళ్లీ ఖాన్‌సాబ్ నయీంకు నచ్చజెప్పారు.

మూడవ రోజు ఖాన్‌సాబ్ మళ్లీ సలాం చేశారు. ఆ వ్యక్తి లోగొంతుతో 'వ అలైకుమ్ అస్సలాం' అంటూ బదులు పలికాడు. తన పేరు రహ్మత్ అని మాత్రం చెప్పాడు.

"రహ్మతా... రహ్మతుల్లానా! అల్‌హందులిల్లాహ్" అంటూ ప్రశంసించారు ఖాన్‌సాబ్. తరువాత...

"రహ్మత్ భాయ్! ఎంత మంచి పేరు మీది. మీ తల్లిదండ్రులు ఎంత మంచి పేరు పెట్టారు మీకు! మీరు నిజంగానే దైవకారుణ్యం. కనీసం మా కోసమైనా మీరు దైవకారుణ్యమే. నిజంగానే మీరు లేకపోతే మేమీ చీకటి కొట్టంలో ఇలాగే మగ్గిపోయేవాళ్లం.

మా కాలకృత్యాలు తీర్చేవాడు, మాకు అన్నపానీయాలు సమకూర్చేవాడు ఇంకెవడున్నారు? అందుకే మీరు మా కోసం దైవకారుణ్యం అంటున్నాను నేను.

రహ్మత్ భాయ్! మరొక్క చిన్న పని కూడా చేసి పుణ్యం కట్టుకోండి. రమజాన్ మాసం వస్తోంది, ఉపవాసం ఉందామనుకుంటున్నాం. ఓ చిన్న

క్యాలెండర్ తెచ్చిస్తే రోజా సమయాలు తెలుసుకోవడం మాకు సులువవుతుంది. దైవం మీపై కారుణ్యం కురిపిస్తాడు. దయచేసి తెచ్చి పెట్టండి."

రహ్మత్ విన్నాడు కాని ఒక్క మాటా మాట్లాడలేదు. తెస్తానూ అన లేదు, తేనూ అనలేదు. ఆ విధంగా ఒకటి... రెండు.. మూడు... ఆరు రోజులు గడిచిపోయాయి. ఏడవ రోజు ఒక చిన్న కాగితం ముక్క ఖాన్‌సాబ్‌కందించాడు. అది రమజాన్ రోజా, సహెరి, ఇఫ్తార్ సమయాలను సూచించే క్యాలెండరు.

ఖాన్‌సాబ్ దాన్ని చూస్తున్నంతలో ఆ వ్యక్తి గోడకు ఒక మేకు కొట్టి క్యాలెండర్ దానికి తగిలించాడు. తరువాత మళ్ళీ ఏం గుర్తొచ్చిందో ఏమో, దాన్ని పీకి అక్కడే పడేసి, క్యాలెండర్ చేతికిచ్చి వెళ్ళిపోయాడు.

"అల్‌హందులిల్లాహ్" (అల్లాహ్‌కు కృతజ్ఞతలు) ఆయన మన మొరను ఆలకించాడు" అన్నాడు ఖాన్‌సాబ్.

"ఖాన్‌సాబ్! మీరు భలే భోలా మనిషి. కుడుమిస్తే పండగని సంబరపడిపోతారు! మనం బయటపడడానికి మార్గమూ తెరచుకోలేదు, కాళ్ళు చేతుల సంకెళ్లూ అలాగే ఉన్నాయి. మీరేమో 'దైవం విన్నాడు' అంటున్నారు.

"చూడు నయీం! దైవం మనం బయటపడడానికి సామగ్రి సమకూర్చాడు. దాన్ని వినియోగించుకొని బయటపడే ఉపాయం

ఆలోచించడం ఇక మన పని."

"నాకైతే ఒక్కముక్కా అర్థం కాలేదు. మీరు చెప్పేదేదో కాస్త వివరంగా చెబుతారా?"

"అదిగో మేకు. అది పట్టుకో. ఏం చేయాలో చెబుతాను."

నయీం మెల్లగా జరిగి దాన్ని అందుకున్నాడు.

"ఇప్పుడు మనం చాలా ఓపిగ్గా, శ్రమపడి దీంతో ఓ ఇటుకనైనా తీయగలగాలి."

నయీంకు మళ్లీ సన్నపాటి ఆశ చిగురించింది. ఇద్దరూ కలిసి చాలా శ్రమపడి మేకు సాయంతో గోడకు చిన్న రంధ్రం వేయగలిగారు.

నయీంకు మళ్లీ 'మనాది' పట్టుకుంది. "ఖాన్‌సాబ్! ఆ దుర్మార్గుడు గనక ఈ కన్నాన్ని చూస్తే ఇంకేమైనా ఉందా?"

"ఏమీ కాదు. దైవం ఏది తలిస్తే అదే జరుగుతుంది. మన ప్రయత్నం మనం చేయాలి అంతే" అంటూ ఇటుక మళ్లీ యధాతథంగా పెట్టేయమన్నారు ఖాన్ సాబ్.

నెలకోసారి నజీర్ కూడా వచ్చి వెళ్లేవాడు. నజీర్ వచ్చినప్పుడు నయీం కాస్త భయపడేవాడు.

"నయీం! భయపడకు! వీడేకాదు, మరొకడు కూడా చూస్తున్నాడు."

"మరొకడా?"

"అవును. నీ దేవుడు, నా దేవుడు, మనందరి దేవుడు. మానవులందరి దేవుడు!"

"మన కాళ్లూ చేతులు బంధించి లేకపోతే పారిపోవడానికి బాగుండు."

"అవునవును. కాని తొందరపడకు. విచారించకు. దైవం ఎలా ఏర్పాట్లు చేస్తున్నాడో, చూశావా? అన్ని పనులూ త్వరలోనే చక్కబడతాయి. మన ప్రార్థనలు దైవం ఆలకించాడు."

★ ★ ★

"ఏం రహ్మత్... ఎలా ఉన్నావు? ఏమంటున్నారు మన అతిథులు."

"ఓహో... నజీర్‌గారు... అంతా బాగుబాగు... ఏమిటి ఈ రోజు మీరు ఇలా వేళ కాని వేళ దయచేశారు?

"అవునవును. వేళ కాని వేళే.. చాలా రోజులైంది కదా? ఈ రోజు వాళ్ల వ్యవహారం కాస్త తేల్చేద్దామని..."

"అవునవును.. ఇంకెంత కాలం? ఇక ఈ క్రీడకు ముగింపు పలకవలసిందే."

"మరి పద... ఈ రోజు ఫైనల్ చేసేద్దాం" అంటూ నజీర్, రహ్మత్ లిద్దరూ లైటు తీసుకుని చీకటి కొట్టం వైపు బయలుదేరారు. తాళంతీసి లోనికి తొంగి చూశారు.

ఖాన్‌సాబ్, నయీం ఇద్దరు తమ తమ స్థానాల్లో సంకెళ్ల స్థితిలోనే నమాజులో లీనమై కనిపించారు. ఖాన్‌సాబ్ పక్కనే రమజాన్ వేళల క్యాలెండర్ కనిపించింది. నజీర్ దాన్ని చేతిలోకి తీసుకొని, 'ఇది ఇక్కడికెలా వచ్చింది?' అని ప్రశ్నించాడు.

"అది నేనే తెచ్చిచ్చాను. రమజాన్ మాసం వస్తోంది కదా! ఒక చిన్న క్యాలెండర్ తెచ్చివ్వమని ఖాన్‌సాబ్ ఒకటే పోరుతుంటే చిన్న కాగితం ముక్కకు ఏమవుతుందిలే అని తెచ్చి పడేశాను అదీగాక ఆ ఖాన్‌సాబ్ ఐదుపూటలా ప్రార్థన చేసే మనిషి. పోనీలే అని తెచ్చిచ్చాను."

"పోనీలే అని తెచ్చిచ్చావా?..." నజీర్ ఆగ్రహం నషాళాన్నంటింది. రహ్మత్ చెంపపై లాగి ఒక్కటి తన్నాడు.

నజీర్ దెబ్బకు రహ్మత్‌కు చుక్కలు కనబడ్డాయి. కళ్లు బైర్లు కమ్మాయి. చెంప సవరించుకుంటూ నిలుచున్నాడు.

ఖాన్‌సాబ్ నమాజు ముగించిన తర్వాత, "నజీర్! నువ్వు అనవసరంగా నీ స్నేహితుణ్ణి కొట్టావు. అతడికి బదులుగా నన్ను కొడితే బాగుండేది. అనవసరంగా నా వల్ల అతడు దెబ్బలు తిన్నాడు" అంటూ నొచ్చుకున్నాడు.

నజీర్ ఈ మాటలకు ఏమీ సమాధానం చెప్పకుండా, "ఈ రోజు ఏదో ఒకటి ఫైనల్ చేద్దామని వచ్చాను. మీరిద్దరూ ఈ కాగితాలపై సంతకాలు పెట్టండి" ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడు నజీర్.

"సంతకాలా?" ఆశ్చర్యంగా అడిగారు ఖాన్‌సాబ్.

"అవును. సంతకాలే. ఎందుకు, ఏమిటి?లాంటి చచ్చు ప్రశ్నలు అడక్కూడదు. కిక్కురుమనకుండా సంతకం పెట్టాలి."

"పెట్టకపోతే...?" ప్రశ్నార్థకంగా చూశాడు ఖాన్‌సాబ్.

"పెట్టకపోతే... పండుగ నాడు ప్రజలంతా పండుగ సంబరాలు జరుపుకుంటుంటే, మీరు చావుకు సిద్ధపడి మృత్యుకేళి జరుపుకోవాల్సి ఉంటుంది."

"మరి సంతకం పెడితే..?" మళ్లీ ప్రశ్నించారు ఖాన్‌సాబ్.

"ప్రస్తుతానికి చావు ముహూర్తాన్ని తప్పించి, ఏం చేయాలనేది తరువాత ఆలోచిస్తా."

"సరే... ఇంకా వారం రోజులు గడువుందిగా... నాకూ ఆలోచించుకోవడానికి కొంత సమయం ఇవ్వండి."

నజీర్ మారుమాట్లాడకుండా బయటికి వెళ్లిపోయాడు. రహ్మత్ యధాతథంగా తాళం వేసేసి అతణ్ణి అనుసరించాడు.

"రహ్మత్ అన్నా! నేను నిన్ను చెంపదెబ్బ కొట్టాను కాని, వాస్తవంగా నన్ను నేనే కొట్టుకున్నాను. నా అనుమతి లేకుండా ఏమీ జరక్కూడదనేది నా ఉద్దేశం. ముందు ముందు ఇలా జరక్కుండా చూడు. నీకంటే నమ్మకస్తులైన వారు నాకు మరెవ్వరూ లేరు. ఈ వారం రోజులు మనకు చాలా కీలకం. పథకం అంతా నీకర్థమైపోయింది గదా!"

రహ్మత్! ఇలారా..." అంటూ కిన్నెరసాని అభయారణ్యంలోకి దారితీశాడు. కొంత దూరం వెళ్లాక జనసంచారంలేని ఓ ప్రదేశంలో పొదల చాటుకు తీసుకువెళ్లాడు. అక్కడ రెండు బొందలు తవ్వబడి ఉన్నాయి. వాటిని రహ్మత్‌కు చూపిస్తూ ఇందులో ఒకటి ఖాన్‌సాబ్‌ది, రెండోది ఆ నయీమ్‌గాడిది. పండుగ రోజు అర్ధరాత్రి ముహూర్తం. ప్రజలంతా పండుగ సంబరాల్లో.. మనం మన సంతోషంలో... నేను ఖచ్చితంగా రాత్రి పన్నెండు గంటలకు వస్తా.. ఏమన్నా కోపమా? విషయం చెప్పి, చెంపదెబ్బ కొట్టినందుకు అనునయించాడు.

"కోపమేముంది? తప్పు నాది కదా! అయినా మీరు నా బాస్. అందరికంటే ఎక్కువ ముట్టేది కూడా నాకే. ఈ రోజే మీకింత కోపమొచ్చింది. ఎప్పుడూ రాలేదు. నన్ను క్షమించండి."

"తప్పకుండా, నువ్వు కూడా మరి" అంటూ నజీర్ ఐదొందల రూపాయల కట్టను రహ్మత్ చేతిలో ఉంచి 'మరినేవస్తాను' అంటూ సంతృప్తిగా వెళ్లిపోయాడు.

రహ్మత్ ఓ చేతిలో నోట్ల కట్టను, మరో చేత్తో దెబ్బతిన్న చెంపను సవరించుకొన్నాడు. అతడికి దెబ్బ చెంపపై తగిలిందిగాని, బాధ మాత్రం మనసులో వ్యక్తమైంది.

అతడు నేరుగా తన రూమ్‌కొచ్చి మేనువాల్చాడు. ఆలోచనలు కె.టి.పి.ఎస్. పొగలాగా దట్టంగా తన మేథను కమ్మేస్తున్నాయి.

"బద్మాష్! పుండాకోరు వెధవా..! అన్నెం పున్నెం ఎరుగని అమాయక స్త్రీలపై వల పన్నుతావా? ఖాన్‌సాబ్ లాంటి మంచి మనుషుల్ని సజీవంగా పూడ్చి పెట్టడానికి బొందలు తవ్వుతావా? ఉండు, నీ పని చెబుతా! ఈ చెంపదెబ్బకు ప్రతీకారం తీర్చుకోకపోతే."

ఆలోచనల్ని అక్కడే కట్ చేసి దిగ్గున లేచి కూర్చున్నాడు. ఎంతసేపు అలా కూర్చున్నాడో అతనికే తెలియదు. ఆగ్రహం, అసహనంతో అతడా రాత్రి నిద్రలేకుండానే గడిపాడు.

తెల్లవారుజామున సహెరి కోసమని భోజనం తీసుకెళ్లినప్పుడు స్వయంగా అతడే ఖాన్‌సాబ్‌కు సలాం చేశాడు. ఖాన్‌సాబ్ సలాముకు బదులు పలికి; "మా వల్ల అనవసరంగా మీరు దెబ్బతినవలసి వచ్చింది. మాకు చాలా బాధగా ఉంది" అన్నారు.

"ఖాన్‌గారూ! చివరి ఫలితం సంతోషం అయినప్పుడు, అంతకు ముందు బాధలు సహించడం కూడా సంతోషమే కావాలి. మీరేమీ విచారించకండి. మీరు మాత్రం ఆ కాగితాలపై సంతకాలు పెట్టకుండా నా కోసం కూడా ప్రార్థించండి" అంటూ భోజనం ఇచ్చి వెళ్లిపోయాడు రహ్మత్.

ఖాన్‌సాబ్ ఓసారి సకిలించి 'నయీం! ప్రార్థన ఫలించిందంటావా? లేదంటావా?' అన్నారు.

'ఇప్పుడు నాక్కాస్త నమ్మకం కుదురుతోంది."

"అందుకే దైవకారుణ్యం పట్ల నిరాశ చెందవద్దని నీకు ఎన్నో సార్లు చెప్పాను."

"ఖాన్ గారూ! మీ చాకచక్యాన్ని ఎంత ప్రశంసించినా తక్కువే. ఎంత చాకచక్యంగా వ్యవహరించారు అతడితో...! రహ్మత్‌ను బాగా ఐస్ చేశారు. సలాంతో కలాం మొదలైంది. ఈ రోజు అతడే సలాం చేశాడు. నజీర్ చేత దెబ్బతిన్న తర్వాత ఏమన్నా మనిషి మారాడేమో!"

"ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? ఎవరి బుద్ధి ఎప్పుడు మారుతుందో, ఎవరెప్పుడు సన్మార్గం వైపు వస్తారో ఎవరూ చెప్పలేరు. మన పరిధిలో ఉన్నంత వరకు ప్రయత్నించడం మన బాధ్యత. ఫలితాన్ని ప్రసాదించేవాడు దైవం."

"బహుశా అప్పుడు మీరన్న మాట అతడిపై ప్రభావం చూపిందనకుంటా?"

"ఏ మాట?"

"అదే.. ఒక రోజు అతడు పామును కొట్టి దాన్ని బండబూతులు తిట్టాడు. అప్పుడు మీరు, "సోదరా! ఇప్పుడు ఈ నోటితో అల్‌హందులిల్లాహ్, దైవానికి స్తోత్రం వెలువడితే బాగుండును. ఎందుకంటే దైవం మనల్ని దీని బారి నుండి రక్షించాడు" అన్నారు. కాని అతడు మౌనంగానే ఉన్నాడు. ఆనాటి నుండి ఈనాటి వరకు అతడి నోటి నుండి అలాంటి పలుకులు మళ్లీ వెలువడలేదు."

"ఇదంతా దైవకృప లేకుండా మనిషి ఏమీ చేయలేడు. నా ఉద్దేశం ప్రకారం బహుశా రహ్మత్ ఒకప్పుడు మంచివాళ్ల స్నేహం చేసి ఉంటాడు. విన్నావా ఇందాక అతడేమన్నాడో...?"

"ఏమన్నాడు?"

"ఎవరి తుది ఫలితం సంతోషమో వారికి విచారమేముంది?" అన్నాడు. దీనివల్ల మనకు తెలిసేదేమంటే, ఒకప్పుడు రహ్మత్ మంచివాడే. మంచివాళ్ల సాంగత్యంలో గడిపినవాడే. ఏవో కారణాల వల్ల దారి తప్పి వీళ్లను ఆశ్రయించి ఉంటాడు."

"బహుశా మీ అభిప్రాయం కరెక్టే కావచ్చు."

ఈ విధంగా మరి కొన్ని రోజులు గడిచిపొయ్యాయి. ఒకరోజు నజీర్ మళ్లీ వచ్చి కాగితాలపై సంతకాలు పెట్టమన్నాడు. కాని ఖాన్‌గారు తిరస్కరించారు.

"సరే, మంచిది" అని నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు నజీర్. తరువాత రహ్మత్‌కు కొన్ని ఆదేశాలు జారీచేసి, పండుగనాడు రాత్రి పన్నెండు గంటలకు 'స్పాట్' వద్ద హాజరుకావాలని చెప్పాడు.

ఖాన్‌సాబ్, నయీంలకు చివరి అవకాశం కూడా పోయిందని, ఇక మరో అవకాశం వారికిచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు.

★ ★ ★

బాబా అరు బయట కిటికీ వైపు మంచం వేసుకొని మున్నీని ఆడిస్తు న్నాడు. వయసు పైబడ్డప్పటికీ ఆయన మాటలో బింకం తగ్గలేదు. కంచుకంఠం, ధైర్యస్థయిర్యాలకు మారు పేరాయన.

"మీ నాన్న వస్తాడులే.. అదిగడిగో.. వస్తున్నాడు..." అంటూ మున్నీని గుండెలపై నిలబెట్టుకొని ఆమె చేతుల్ని పట్టుకొని ఆడిస్తున్నాడు. మున్నీ వచ్చీరాని నత్తిమాటలతో.. "ఏలి మా నాన్న ఎక్కల..." అంటోంది ముద్దు ముద్దుగా.

"ఈ రోజు వస్తాడు..." "నిజంగానా...?" "ఆఁ... నిజంగా..."

"చానా డబ్బులు తెస్తాడు కదూ.. ఇన్ని చాకేటులు తెత్తలు కదూ."

"ఆఁ... అవును... డబ్బులు... పండక్కి బట్టలు అన్నీ తెస్తాడు."

సకీనా, సమీనా వారి మాటలు వింటూ మనసులో పుట్టెడు దుఃఖం ఉన్నప్పటికీ ముసిముసిగా నవ్వడానికి ప్రయత్నించారు. లోపలికెళ్లిన తర్వాత వారి కళ్ల నుండి అశ్రుబిందువులు టపటపా రాలసాగాయి.

"ఓ మా ప్రభూ! అమాయకురాలైన ఆ పసిబిడ్డ కోరికను తీర్చు" సమీనా దీనంగా ప్రార్థించింది.

సకీనా దుఃఖానికైతే అంతేలేదు.

అంతలో ట్రింగ్..ట్రింగ్..మంటూ ఫోన్ రింగయింది. సమీనా రిసీవర్ అందుకొని, హలో అనీ అనకముందే... "ఈ రాత్రికి జాగ్రత్త. మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అంటూ ఫోన్ పెట్టేశారు ఎవరో.

సమీనా నిలువెల్లా వణికిపోయింది. కాని వెంటనే తేరుకొని సకీనాకు విషయం చెప్పింది. ఇద్దరూ కలిసి బాబా దగ్గరికొచ్చారు. వీరి వాలకం చూడగానే ఏదో కీడు శంకించాడు ముసలిబాబా అలియాస్ ముంతాజ్‌ఖాన్.

మున్నీను వాళ్లమ్మకిస్తూ; "అమ్మా! ఎందుకంతగా భయపడు తున్నారు? ఏమిటి విషయం?" అంటూ ప్రశ్నించాడు.

సమీనా ఫోన్ విషయం చెప్పింది.

ముంతాజ్ ఖాన్ ఒక్క క్షణం ఆలోచించి, "మీరేమీ కంగారు పడకండి. ఈ విషయం ఎవరికీ తెలియనివ్వకండి" అని వాళ్లను పంపించి, తన పెద్ద కొడుకు రుస్తుం ఖాన్‌ను పిలిచి అరగంట సేపు చర్చించాడు. తరువాత సకీనా, సమీనాలను వేరే ఇంట్లోకి మార్చివేశారు. ఇంటికి లోపలి నుండి తాళం వేసేశాడు.

పొద్దు భారంగా గడిచింది. సాయం సంధ్యవేళయ్యింది. సూర్యుడు తన పని ముగిసిందని ఎర్రటి దుప్పటి కొప్పుకొని పడమటి కనుమల్లోకి వెళ్లిపోయాడు.

మగ్రిబ్ అజాన్ శ్రవణానందంగా వినిపించింది. ఉపవాసాల విరమణ అయిపోయింది. సకీనా, సమీనాలు రోజా విరమణ సమయంలో దీనాతిదీనంగా తమ ప్రభువును వేడుకున్నారు. "దేవా! ధనం, ప్రాణం,

పరువు మర్యాదలు అన్నీ నీవే. వాటిని రక్షించేవాడవు కూడా నీవే."

ఇరుగుపొరుగు అమ్మలక్కలకు ఏమీ తెలియదు. వాళ్లకు తెలిసిందల్లా ఒక్కటే.. "పాపం బాధల్లో ఉన్న ఆడవాళ్లు కాబట్టి ఏదో జాలిపడి తమ ఇళ్లకు పిలిచారు ఈ రోజుకు..." తలా ఒక రకంగా మాటల్లో పడిపోయారు.

తెల్లవారితే పండుగ. అందుకే తలా ఒక పనిలో లీనమైపోయారంతా. సకీనా, సమీనాలు కూడా అన్యమనస్కంగా, యాంత్రికంగా వారితోపాటు ఏదో ఒకటి చేస్తున్నారు.

ఒక్కోసారి వాళ్ల బాధను చూసిన అమ్మలక్కలు, 'రేపు పండుగ కదా! తమ భర్తలూ ఇంట్లో ఉంటే బాగుండేదని, లేకపోవడంతో బాధ పడుతున్నారని" ఒకరికొకరు చెప్పుకున్నారు.

సరిగ్గా రాత్రి పన్నెండు గంటల సమయం. "ఎవరది?" గర్జించాడు బాబా అలియాస్ ముంతాజ్ ఖాన్.

ధన్ ధన్ ధన్... ఒకటి... రెండు... మూడు.. ఒకరి తరువాత ఒకరు దుండగులు గోడదూకి లోపలికి ప్రవేశించారు. బాబా క్షణం కూడా ఆలస్యం చేయకుండా వారిపై విరుచుకుపడ్డాడు.

బాబా ధాటికి ఒకడు 'చచ్చాన్రో' అంటూ కూలబడ్డాడు. ఈ లోపులో ఏక కాలంలో నలుగురు దుండగులు బాబాపై దాడి చేశారు. బాబా చాకచక్యంగా వారి బాధ నుండి రక్షించుకున్నాడు గాని, నేలపై పడిపొయ్యాడు.

పది పదిహేను మంది దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. ఒకడు చాలా జాగ్రత్తగా టార్చిలైటు వేసి ఇల్లంతా గాలించాడు. కాని అతడు ఎవరి కోసమైతే వచ్చాడో, ఆమె ఇక్కడ లేదని తెలుసుకుని తన అనుచరులకు సైగ చేశాడు.

దుండగులు వెంటనే సమీనా ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించే ప్రయత్నంలో ఉన్నంతనే చూస్తుండగానే ఒకడు తొడలో బుల్లెట్ దిగడం వల్ల కుప్పకూలిపోయాడు.

ప్రమాదాన్ని పసిగట్టిన దుండగులు గాయాలపాలైన తమ అనుచరులను తీసుకొని పారిపోదామని ప్రయత్నించారు. కాని రుస్తుం ఖాన్ వెళ్లి ఊళ్లోని యువతనంతా పోగేసుకొచ్చి ఇంటిని చుట్టుముట్టాడు.

ఈలోపులో రహ్మాత్ తన పథకాన్ని అమలుపరిచాడు. వీధి వారంతా ఆశ్చర్యపొయ్యారు. ఖాన్‌సాబ్, నయీం దర్జాగా పెద్ద పెద్ద కర్రలతో తమ ఇంటి ముందు నిలబడి ఉన్నారు.

ఒక వ్యక్తి వారినుద్దేశించి, "ఇప్పుడు ఇంట్లోంచి బయటికొచ్చే వారిని పట్టుకొని చితకబాదండి" అన్నాడు. ఇతను రహ్మాత్. దుండగులు పారి పోవడానికి ఎంతో ప్రయత్నించారు కాని అందరూ పట్టుబడ్డారు. సూత్రధారి, పాత్రధారి అయిన నజీర్ పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాడు.

అందరూ నజీర్‌ను వింత మృగాన్ని చూసినట్లు చూడసాగారు. ఖాన్‌గార్ని, నయీమ్‌ను, రహ్మాత్‌ను డేగ కళ్లతో కొరకొరగా చూస్తూ తన పథకం ఎలా వికటించిందీ ఆలోచిస్తున్నాడు నజీర్.

అతడికి ఈ లోపు వీధివారంతా తలా ఓచేయి వేసి దేహశుద్ధి చేశారు. పెడరెక్కలి విరిచి కరెంటు స్థంభానికి కట్టి పడేశారు. ఈ విధంగా చివరికతడు తాను పన్నిన ఉచ్చులో తానే చిక్కుకొని చివరి ఘడియలు లెక్కిస్తున్నాడు.

తప్పు తెలుసుకున్న నయీం పశ్చాత్తాపంతో కుమిలిపోతూ భార్యకు క్షమాపణ చెప్పుకున్నాడు. ఖాన్‌సాబ్ కుటుంబానికీ నిండు మనసుతో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

సకీనా కల తాలూకు స్మృతుల్ని నెమరువేసుకుంటూ, తనకు దైవ సహాయం ఎలా లభించిందో ఊహించుకుంటూ 'సజ్దా'లో పడిపోయింది.

చిన్నారి మున్నీని గుండెలకు హత్తుకున్న నయీం పరివర్తిత హృదయంతో భార్యవైపే తదేకంగా చూస్తూ ఉండిపొయ్యాడు. అతని కళ్లు ఆనంద భాష్పాలు రాల్చుతుంటే, మనసులో సంతోషం సుడులు తిరుగుతోంది.

తెలుగులో ఇస్లామీయ సాహిత్యం కోసం
నేడే సంప్రదించండి

TRUST

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్

హైదరాబాద్-500 002. ఫోన్:24564583